ఈనాటి
# తెలుగోడు
PRGI-NO-APTEL/25/A2739
EENAATI TELUGODU... Telugu Daily
https://www.eenaatitelugodu.com

Ph:8368102842
నాశా క్లినిక్
డా.భానుప్రకాష్ MBBS
సంప్రదించు వేళలు: ఉ.7.30 నుంచి 8.30 వరకు
సా.4 గం.నుంచి రాత్రి.8.30 వరకు
డా.నిహారిక BHMS
సంప్రదించు వేళలు:
ఉ.9 గం. నుంచి సా.5 గం. వరకు
Ph:9704461510
మా మెడికల్స్
ఎమ్మార్వో ఆఫీస్ ఎదురుగా ఓ.డి.చెరువు

సంపుటి-1 | సంచిక - 181 | మంగళవారం 31 మార్చి 2026 | పేజీలు - 8 | వెల - రూ.. 5
Published From - Vijayawada, Anantapur, Sri Satyasai, Kurnool, Nandyala, Kadapa, Annamayya, Srikakulam, Nellore, chittoor, Tirupati

ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం
## చేసుకుంటాం
**అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంచలన ప్రకటన**



**వాషింగ్టన్(తెలుగోడు), మార్చి 30 :** ఇరాన్‌కు అత్యంత కీలకమైన, ఆర్థిక జీవనాడి అయిన ఖర్గ్ ద్వీపాన్ని అమెరికా స్వాధీనం చేసుకునే అవకాశం ఉందని అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. ఒక్కసారి తీవ్ర దాడులు మొదలుపెడితే, ఖర్గ్ ద్వీపాన్ని చాలా తేలికగా స్వాధీనం చేసుకుంటామని అన్నారు. ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకోవడం అమెరికాకు పెద్ద విషయం కాదు. మా ఎదుట చాలా ఆప్షన్లు ఉన్నాయి. ఆ ద్వీపాన్ని మేం స్వాధీనం (మిగతా 2లో)

నితీశ్ కుమార్
## రాజీనామా
**బిజెపి అధ్యక్షుడు నితిన్ నబీ కూడా రాజీనామా**



**అమరావతి(తెలుగోడు), మార్చి 30 :** బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ శాసన మండలికి సోమవారం రాజీనామా చేశారు. మార్చి 16వ తేదీన ఆయన రాజ్యసభకు ఎన్ని కయ్యారు. ఈ ఎన్నిక అనంతరం రాజ్యాంగ నిబంధనలకు అనుగుణంగా నితీష్ కుమార్ శాసనమండలికి రాజీనామా చేశారు. రాజ్య సభకు ఎన్నికైన 14 రోజుల్లో నితీష్ శాసనసభ సభ్యత్వాన్ని వదులుకున్నారు. అలాగే బిజెపి జాతీయ 2లో



# పేదల సొంతింటి పండుగ

- హైదరాబాద్,చెన్నైని మించి అమరావతి అభివృద్ధి..
- యువత రాజకీయాల్లోకి రావాలి...టిడిపి అవకాశం ఇస్తుంది..
- పేదల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యం..
- సూల్లూరుపేటలో పేదలకు టిడ్కో ఇళ్ల పంపిణీ ..
- రాష్ట్రవ్యాప్తంగా 2,50,893 మందికి సొంతిల్లు..
- ఇండ్ల పండగ జరుగుతోందన్న సిఎం చంద్రబాబు...

**తిరుపతి (తెలుగోడు), మార్చి 30 :** ఈనెల పండుగల నెల అని, ఇప్పుడు పేదల సొంతింటి పండుగ జరుపుకుంటున్నామని సిఎం చంద్రబాబు పేర్కొన్నారు.రాజధాని అమరావతిని హైదరాబాద్, చెన్నై కంటే గొప్పగా తయారు చేసే బాధ్యత మేము తీసుకుంటాం అని సిఎం చంద్రబాబు అన్నారు. యువతకు ఇదే ఆహ్వానం. టీడీపీలోకి వస్తే అవకాశాలు కల్పిస్తాం అన్నారు. యువత రాజకీయాల్లోకి రావాలన్నారు. వైసీపీలాంటి పనికిమాలిన ప్రభుత్వాన్ని ఎప్పుడూ చూడలేదు. ప్రజలకు కోపం రావడం వల్లే వైసీపీని 11 సీట్లకు పరిమితం చేశారని అన్నారు. సూళ్లూరుపేట నియోజకవర్గం నాయుడుపేట వేదికగా 2.50 లక్షల ఇళ్లను లబ్దిదారులకు సీఎం నారా చంద్రబాబు నాయుడు పంపిణీ చేశారు. 2,50,893 పేద కుటుంబాలకు ఇళ్లను పంపిణీ చేసి వారితో గృహ ప్రవేశం చేయించారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఇంత భారీ మొత్తంలో గృహ ప్రవేశాలు చేయించడం ఇది రెండోసారి. మొదటి విడత కింద 12 నవంబర్ 2025న 3,00,192 ఇళ్లను పంపిణీ చేసింది. తాజాగా నేడు 1,00,875 టిడ్కో ఇళ్లతోపాటు మరో 1,50,018 ఇళ్లను మొత్తం 2,50,893 గృహాలను పేదలకు సీఎం చంద్రబాబు సర్కార్ అందించింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు భారీ బహిరంగ సభలో ప్రసంగించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ..'మార్చి నెలలో మొన్ననే ఉగాది, నిన్న రంజాన్ జరుపుకున్నాం. ఇవాళ 2,50,893 మందికి ఇళ్ల పండుగ జరుపు కుంటున్నాం. ఇది ఒక చరిత్ర. మీ అందరిలో ఆనందం చూస్తుంటే, నా జన్మ ధన్యమైందని అనిపిస్తోందని అన్నారు. భవిష్యత్తులో మీకన్నీ శుభాలే జరగాలని, అంతా మంచే జరగాలని కోరుకుంటున్నా. ఒకప్పుడు గుడిసెల్లో ఉండేవారం. ప్రతి ఒక్కరికీ పక్కా ఇల్లు ఇవ్వాలని, పక్కా ఇళ్ల నిర్మాణాలకి యుగపురుషుడు ఎన్టీఆర్ శ్రీకారం చుట్టారు. ప్రతి ఒక్కరికీ ఇల్లు ఉండాలనేది టీడీపీ 2లో

ఒంటిమిట్ట రాముడి కళ్యాణానికి తిరుమల
# శ్రీవారి లడ్డూ
**నవనీత కృష్ణాలంకారంలో రాములవారు.. దర్శించుకుని పులకించిన భక్తులు..**



**ఒంటిమిట్ట(తెలుగోడు),మార్చి 30 :** ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు సోమవారం ఉదయం నవనీత కృష్ణాలం కారంలో రాములవారు ముగ్ధ మనో హరంగా దర్శనమిచ్చారు. ఉదయం 7.30 గంటల నుండి స్వామివారి ఊరేగింపు వైభవంగా జరిగింది. కేరళ డ్రమ్స్, భక్తజన 2లో

ప్రతి ధాన్యం గింజనూ
# కొంటాం
**8గంటల్లోనే రైతుల ఖాతాల్లోకి డబ్బులు కోవూరు ..**
**ఎమ్మెల్యే ప్రశాంతితో కలిసి పరిశీలించిన మంత్రి నాదెండ్ల..**



**నెల్లూరు (తెలుగోడు), మార్చి 30 :** చివరి ధాన్యం గింజ వరకు కొనుగోలు చేస్తామని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ధాన్యం అమ్మిన ఎనిమిది గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు పడేలా చూస్తున్నామని మంత్రి అన్నారు. క్షేత్రస్థాయిలోనూ రైతులు.. డబ్బులు వేగంగా పడుతున్నాయని చెప్పడం ఆనందంగా ఉందని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో ప్రత్యేకంగా కల్లాలు ఏర్పాటు చేస్తామని ఆయన ప్రకటించారు. నెల్లూరు జిల్లా సాగు చాలా ప్రత్యేకమైనదని మంత్రి అన్నారు. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలతో పోలిస్తే 40 నుంచి 60 రోజులు 2లో

లొంగిపోయిన మవోయిస్ట్
# నారాయణరావు
**వారికి పరిహారం అందిస్తామన్న డిజిపి..**
**మావోయిస్ట్ ఉద్యమం కనుమరుగైందన్న నారాయణ..**



**అమరావతి(తెలుగోడు), మార్చి 30 :** మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు చెన్నూరు నారాయణ రావు అలియాస్ సోమన్న ఏపీ డీజీపీ ముందు లొంగిపోయారు. దాదాపు 36 సంవత్సరాలుగా మావోయిస్టు పార్టీలో కీలక పాత్ర పోషించిన నారాయణ సహా మొత్తం 9 మంది సభ్యులు పోలీసుల ఎదుట లొంగి పోయారు. లొంగిపోయిన వారిలో ఏవోబీ స్పెషల్ జోనల్ కమిటీ, డివిజనల్, ఏరియా కమిటీలకు చెందిన మావోయిస్టులు ఉన్నారు. మావోయిస్టుల లొంగుబాటుపై ఏపీ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లో మావోయిస్టు కార్యకలాపాలు ముగింపు దశకు చేరుకున్నాయని, ఏపీ ఇప్పుడు నక్సల్స్ ఫ్రీ స్టేట్ అని డిజిపి అన్నారు. అందరి కృషితో ఇది సాధ్యమైంది. కాల్పులు కూడా జరిగాయి, లొంగుబాట్లు కూడా జరిగాయి. మా పిలుపునకు స్పందించి 9 మంది లొంగిపోయారు. లొంగిపోయిన వారికి ప్రభుత్వం తరపున అన్ని రకాల సదుపాయాలు అందిస్తామని వెల్లడించారు. చెన్నూరు నారాయణకు ప్రభుత్వం నుంచి రూ.25 లక్షల ఆర్థిక సహాయం అందుతుంది. మిగతా వారికి 24.20 లక్షలు అందిస్తున్నాం' అని చెప్పారు. మావోయిస్టు అగ్రనేత గణపతి కార్యకలాపాలు కూడా రాష్ట్రంలో లేవని తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో శాంతి, భద్రతలు మరింత బలపడుతున్నాయని అధికారులు భావిస్తున్నారు. ఈ సందర్భంగా మావోయిస్టు నారాయణ మాట్లాడుతూ.. గతంలో పోలిస్తే ఇప్పుడు పరిస్థితులు పూర్తిగా మారాయని చెప్పారు. దేశంలో మావోయిస్టు ఉద్యమం 2లో

# రేషన్‌లోకి మళ్లీ కిరోసిన్
**ఇరాన్ యుద్ధ ప్రభావంతో దేశంలో ఇంధన సంక్షోభం..**
**పేదల ఇళ్లపై ఎల్పీజీ కొరత తీవ్ర ప్రభావం..**
**60 రోజులపాటు అత్యవసర కిరోసిన్ కేటాయింపు...**



**అమరావతి(తెలుగోడు), మార్చి 30 :** దేశవ్యాప్తంగా ఎల్పీజీ కొరత తీవ్రరూపం దాల్చడంతో కేంద్ర ప్రభుత్వం అత్యవసర చర్యలకు దిగింది. ఇరాన్ యుద్ధ ప్రభావంతో చమురు సరఫరాలో అంతరాయం ఏర్పడటంతో వంటగ్యాస్ కొరత మరింత పెరిగింది. ఈ పరిస్థితుల్లో లక్షలాది పేద కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి.ఈ నేపథ్యంలో కేంద్రం కీలక నిర్ణయం తీసుకుని, గతంలో నిలిపివేసిన కిరోసిన్ పంపిణీని మళ్లీ ప్రారంభించేందుకు ఆదేశాలు జారీ చేసింది. ముఖ్యంగా 21 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో రేషన్ దుకాణాల ద్వారా కిరోసిన్ సరఫరా పునఃప్రారంభం చేయాలని నిర్ణయిం చింది. వంట, దీపాల అవసరాల కోసం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా నాణ్యమైన కిరోసిన్‌ను 60 రోజులపాటు తాత్కాలికంగా కేటాయించాలని కేంద్రం స్పష్టం చేసింది. ఈ చర్యతో బలహీన వర్గాల కుటుంబాలకు ఇంధన లభ్యతను కొంత వరకు స్థిరీకరించాలన్న లక్ష్యం ఉంది.రేషన్ దుకాణాల ద్వారా పరిమిత పరిమాణంలో కిరోసిన్‌ను అందించనున్నారు. స్థానిక పరిస్థితుల ను దృష్టిలో ఉంచుకుని సరఫరాను నియంత్రణలో ఉంచుతామని అధికారులు తెలిపారు.

ప్రియురాలి హత్య, ముక్కలు చేసి ఫ్రిజ్‌లో దాచిన
# ఘాతుకం
**విశాఖలో నేవీ ఉద్యోగి కిరాతకం..**
**ప్రణాళికాబద్ధంగా పిలిపించి హత్య..**
**స్నేహితుడి ద్వారా పోలీసులకు లీక్..**
**అదుపులోకి తీసుకుని విచారణ...**



**విశాఖపట్నం (తెలుగోడు), మార్చి 30 :** విశాఖపట్నంలో ఓ నేవీ ఉద్యోగి అత్యంత దారుణానికి పాల్పడిన ఘటన కలకలం రేపింది. ప్రియురాలిని కిరాతకంగా హత్య చేసి ఆమె శరీరాన్ని ముక్కలుగా కట్ చేసి ఫ్రిజ్‌లో దాచిన ఘటన తీవ్ర సంచలనం సృష్టించింది. విజయనగరం జిల్లా రాజాం ప్రాంతానికి చెందిన నేవీ టెక్నీషియన్ చింతాడ రవీంద్ర విశాఖలో ఎల్బీనగర్ ప్రాంతంలో నివసిస్తున్నాడు. అతని భార్య నెల రోజుల క్రితం పుట్టింటికి వెళ్లిన సమయంలో ఈ ఘాతుకానికి తెగబడ్డాడు.గతంలో పరిచయం ఉన్న మౌనికను తన నివాసానికి పిలిపించుకున్న రవీంద్ర ఆదివారం మధ్యాహ్నం సమయంలో ఆమెను హత్య చేసినట్లు సమాచారం. అనంతరం ఆమె శరీరాన్ని ముక్కలుగా చేసి రెండు మూటలలో కట్టి ఫ్రిజ్‌లో భద్రపరిచాడు. హత్య అనంతరం ఏమి చేయాలో అర్థంకాక శ్రీకాకుళంలో ఉన్న స్నేహితుడికి సమాచారం ఇచ్చాడు. ఆ స్నేహితు డు వెంటనే పోలీసులకు తెలిపాడు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని రవీంద్రను అదుపులోకి తీసుకున్నారు.ఇంట్లో ఉన్న ఫ్రిజ్‌లో రెండు మూటలలో కట్టి పెట్టిన శరీర భాగాలను పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న శరీర 2లో

లాకర్ వస్తువులకు బీమా సౌకర్యం
# కుదరదు
**అందులో ఏం దాచారో బ్యాంకులు చూడవు..**
**లోక్‌సభలో ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్..**



**న్యూ ఢిల్లీ (తెలుగోడు), మార్చి 30 :** బ్యాంకు లాకర్లలో భద్రపరిచిన విలువైన వస్తువుల బీమా కవరేజీ కుదరదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. ఈ అంశంపై కీలక వ్యాఖ్యలు చేశారు. లాకర్లలో దాచిన వస్తువులను బ్యాంకు అధికారులు చూడరని, వాటిని రికార్డు చేయరని స్పష్టం చేశారు. 2లో

ఆక్వారైతులను వేధిస్తే
# సహించేదిలేదు
**చిన్న రైతులపై ఆంక్షలు విధిస్తున్న రెవెన్యూ సిబ్బంది..**
**పెద్దలకే ప్రోత్సాహమా... పేర్ని నాని...**



**మచిలీపట్నం (తెలుగోడు), మార్చి 30 :** మచిలీపట్నంలో కూటమి ప్రభుత్వం దళారుల ను అడ్డుపెట్టుకుని సన్నకారు రైతులను దోచుకుంటోందని వైఎస్సార్సీపీ నేత, మాజీ మంత్రి పేర్ని నాని తీవ్రంగా విమర్శించారు. బందరు రెవెన్యూ డివిజన్ పరిధిలో పనిచేస్తున్న అధికారుల తీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆక్వా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన అనంతరం మీడియాతో మాట్లాడారు.బందరు మండల పరిధిలో చిన్నచిన్న రైతులు చెరువుల మరమ్మతులు చేసుకునేందుకు ప్రయత్నిస్తే అడ్డుకుంటున్నారని అన్నారు. అదే సమయంలో పెద్ద ఎత్తున భూములు కలిగిన వారికి మాత్రం అనుమతులు ఇస్తున్నారని ఆరోపించారు. రెవెన్యూ యంత్రాం గం కొందరు ప్రభావశీలుల తరఫున పనిచేస్తూ చిన్న రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని పేర్కొన్నారు. చెరువుల మరమ్మతులకు ఎకరాకు యాభై వేల రూపాయలు, బోరు త్రవ్వకాల కోసం మరో యాభై వేల రూపాయలు వసూలు చేస్తున్నారని చెప్పారు. దీంతో ఆక్వా రైతులు తీవ్ర ఆర్థిక భారాన్ని ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ విధానాలు రైతాంగాన్ని పూర్తిగా దెబ్బతీసేలా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పెదపట్నం, కానూరు ప్రాంతాల్లో మడ అడవులను చెరువులుగా మార్చుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. కోన గ్రామంలో చిన్న 2లో

ప్రజలను చంపేవారు
# దేశ భక్తులా
**చర్చల ద్వారా సమస్యల పరిష్కారం..**
**సమాంతర ప్రభుత్వాలు నడిపిన మావోయిస్టులు..**
**నక్సల్స్‌పై హోంమంత్రి అమిత్ షా ప్రకటన..**



**న్యూ ఢిల్లీ (తెలుగోడు), మార్చి 30 :** చర్చల ద్వారానే ఏ సమస్యకైనా పరిష్కారం సాధ్యమని.. తుపాకులతో కాదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. ప్రజలను చంపేవారు దేశభక్తులు ఎలా అవుతారని ప్రశ్నించారు. నక్సలైట్లు తమ సిద్ధాంతాన్ని కూడా విదేశాల నుంచి దిగుమతి చేసుకున్నారు' అని అమిత్ షా తెలిపారు. నక్సలైట్లకు ఆదర్శం భారతీయులెవరూ కాదు.. వారికి మావో ఆదర్శమని అమిత్ షా పేర్కొన్నారు. పార్లమెంట్‌లో ఆయన మాట్లాడుతూ.. మాట్లాడితే ప్రజాస్వామ్యం అంటారు కానీ హింసను ఎలా సమర్థిస్తారని ప్రశ్నించారు. కాంబోడియా, పెరూ, కొలంబియాలో భయంకర రక్తపాతం జరిగిందని పేర్కొన్నారు. దేశాభివృద్ధికి మావోయిస్టు సిద్ధాంతాలు, విధానాలు తీవ్ర ఆటంకం అన్నారు. మావోయిస్టుల రక్తపాత సిద్ధాంతాన్ని ప్రజలంతా వ్యతిరేకిస్తున్నారు. బస్తర్‌లో నక్సల్స్ అనేక ఏళ్లపాటు సమాంతరం ప్రభుత్వం నడిపారు. ఆయుధాలు వీడాలని బస్తర్ వెళ్లి పలుసార్లు కోరాం' అని అన్నారు. నక్సలిజం నశించాలని గిరిజనులు కూడా కోరుకుంటున్నారని అమిత్ షా స్పష్టం చేశారు. 'నక్సలిజంపై పోరులో ప్రజలు కూడా మాకు అండగా (మిగతా 2లో)

చైనా సిసి కెమెరాలు
# బ్యాన్
**బ్యాక్ డోర్ ఉంటుందన్న అనుమానం**
**కొత్త నిబంధనలు తీసుకొచ్చిన కేంద్రం**



**న్యూ ఢిల్లీ (తెలుగోడు), మార్చి 30 :** చైనీస్ సీసీటీవీ కెమెరాలను నిషేధిస్తూ భారత్ సంచలన నిర్ణయం తీసుకుంది. దేశ భద్రత దృష్ట్యా ఏప్రిల్ 1వ తేదీ నుంచి 'మేడ్ ఇన్ చైనా' కెమెరాల వినియోగంపై కేంద్ర ప్రభుత్వం కఠిన ఆంక్షలు విధించబోతోంది. దీనికి సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. ప్రస్తుతం 2లో

# పేదల సొంతింటి పండుగ




(మొదటి పేజి (తరువాయి)

సిద్ధాంతం. ప్రతి ఒక్కరికీ ఇల్లు ఇచ్చే బాధ్యత నాదని హామీ ఇచ్చారు. గత వైసిపి ప్రభుత్వంలో వ్యవస్థలని అస్తవ్యస్తం చేశారు. అన్నింటినీ సరిచేస్తున్నాం. ధనికవర్గాలు ఉండే మాదిరిగా టిడ్కో ఇళ్లని నిర్మించిన ఘనత టీడీపీదే. మంచి ఇళ్లు కడితే పాడు చేశారు. పేదల పొట్ట కొట్టారు. ఈ ఏడాది చివరికి పది లక్షల ఇళ్లు ప్రజలకి అందివ్వడమే లక్ష్యం అన్నారు. గత ప్రభుత్వం ప్రజావేదిక విధ్వంసంతో మొదలెట్టి రాష్ట్రం మొత్తాన్ని విధ్వంసం చేసింది. ఎక్కడ చూసినా అవినీతి, అధికార దుర్వినియోగం. రూ.174కోట్లు లబ్దిదారులు కడితే వాటినీ మాయం చేశారు. 82 వేల కుటుంబాలకి ఆ డబ్బును అకౌంట్లలో వేస్తాం. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులని దారి మళ్లించారు. నివాస యోగ్యంకాని స్థలాల్లో ఇళ్లు కట్టించారు. వైజాగ్‌లో ప్యాలెస్ నిర్మించుకున్నారు కానీ పేదలకి ఇళ్లు ఇవ్వడానికి మనసు రాలేదు. అంత పనికిమాలిన ప్రభుత్వాన్ని నేను నా జీవితంలో చూడలేదు. పేదలు ఉండాల్సింది మురికివాడల్లో కాదు. ఇలాంటి టిడ్కో ఇళ్లలో ఉండాలి. మీలో ఆశలు చిగురించాలి. ఇంటి జాగాలేని వారికి జాగా ఇస్తాం. బ్రహ్మాండంగా ఇళ్లు కట్టించి, పేదలకి ఒక ఆస్తి కల్పిస్తాం. ప్రతి ఇంటికీ అఔఉ కనెక్షన్ ఉండాలి. దానికి కూడా రాయితీ ఇస్తాం. ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి ఉండాలి. ప్రతి ఇంటికీ తాగునీరు ఇవ్వాలని పథకం మొదలెడితే దాన్నీ పాడు చేశారు. ప్రతి ఒక్క కుటుంబానికి కుళాయి ద్వారా తాగునీరు అందిస్తాం. ప్రతి ఇంట్లో ఎక్కడికక్కడ విద్యుత్ తయారు చేసుకునే అవకాశం కల్పించాం. ఎస్సీలు, ఎస్టీలకి ఉచితంగా విద్యుత్ ఇస్తున్నాం. బీసీలకి రూ.20 వేలు రాయితీ ఇస్తున్నాం. సూపర్ సిక్స్ సూపర్ హిట్ చేశాం. ఈ ఏడాది 5 లక్షల మంది మహిళలని పారిశ్రామికవేత్తలని చేస్తాం. రాబోయే ఎన్నికల్లో మహిళలకి సీట్లు పెరగబోతున్నాయి. వైసీపీ పాలనలో పోలవరాన్ని నాశనం చేశారు. గోదావరి పుష్కరాలకంటే ముందుగానే పోలవరాన్ని పూర్తి చేస్తాం. ఏప్రిల్ నుంచి ఆకస్మిక తనిఖీలు చేస్తాం. బాగా పనిచేయని అధికారులను ప్రజల ముందే నిలదీస్తాం. ప్రజలు మెచ్చేలా నాయకులు, అధికారులు పనిచేయాలి. ఎమ్మెల్యేల పనితీరు బాగాలేకపోతే ఊరుకునేది లేదు. టెక్నాలజీ ఉపయోగించి సంక్షేమ పథకాల అమలు చేస్తున్నాం. పెన్షన్ల పంపిణీని రియల్‌టైమ్ మానిటర్ చేస్తున్నాం. బాగా పనిచేస్తున్న అధికారులను అభినందిస్తాం. పనిచేయని అధికారులతో పని చేయించడం మా బాధ్యతని అన్నారు.

# ప్రతి ధాన్యం గింజనూ కొంటాం



(మొదటి పేజి (తరువాయి)

ఆలస్యంగా దిగుబడి వచ్చే ప్రాంతమిది అని చెప్పుకొచ్చారు. సోమవారం ఉదయం కోవూరు మండలం ఇనమడుగులోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా పొలాల్లో రైతులతో మాట్లాడి వారి సమస్యలు, ఇబ్బందులు తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. రైతుల నుంచి ధాన్యాన్ని మొత్తం కొనుగోలు చేయాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పక్కా ఏర్పాట్లు చేసిందని వెల్లడించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నెల్లూరు జిల్లా నుంచి ఒక్క ధాన్యం గింజ కూడా కొనుగోలు చేయలేదని, రైతులను నిలువునా ముంచేశారని ఆయన ఆరోపించారు. ధాన్యం కొనుగోలు విషయంలో అప్పటి నేతలు గోల్‌మాల్ చేసి రూ.82 కోట్ల మేర అవినీతి చేశారని మంత్రి నాదెండ్ల మనోహర్ ఆరోపించారు. ప్రస్తుతం ధాన్యం కొనుగోలు వ్యవస్థలను క్రమబద్ధీకరిస్తున్నామని చెప్పారు. గత ఏడాది 75 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించగా, ఈ ఏడాది 2.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యం పెట్టుకున్నామని మంత్రి తెలిపారు. ఇప్పటికే 60 వేల మెట్రిక్ టన్నులు సేకరించామన్నారు. రైతులందరూ ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే అమ్మాలని సూచించారు. రైతులకు తేమ సమస్య ఉందని, 22 శాతం తేమ ఉన్నా ధాన్యం తీసుకునేలా ఆదేశాలు ఇస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఆధునిక డ్రోన్లు ఇచ్చిన తరహాలో డ్రయర్లు కూడా రైతులకు అందుబాటులో ఉంచుతామని తెలిపారు. జిల్లాలోని రైస్ మిల్లులన్నీ వెంటనే బ్యాంక్ గ్యారంటీలు ఇవ్వాలని, అలా చేయని పక్షంలో వాటిని బ్లాక్ లిస్ట్‌లో పెడతామని మంత్రి హెచ్చరించారు. మిల్లర్ల అవకతవకలు, నిర్లక్ష్యం సహించేది లేదని మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు.

# నష్టాల్లో వున్న ప్రభుత్వరంగ సంస్థలను సమీక్షించాలి



**హైదరాబాద్ (తెలుగోడు), మార్చి 30 :**

తెలంగాణ ప్రభుత్వ రంగ సంస్థల కార్యకలపాలు, లాభ నష్టాలపై కాగ్ నివేదిక విడుదల అయింది. 2023 మార్చి వరకు పబ్లిక్ సెక్టార్ పనితీరుపై కంప్ట్రోలర్ అండ్ ఆడిటింగ్ జనరల్ కాగ్ కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రభుత్వరంగ సంస్థలకు కాగ్ పలు సిఫారసులు చేసింది. నష్టాల్లో ఉన్న కంపెనీల పనితీరుని సమీక్షించాలని సూచించింది. నష్టాల్లో ఉన్న కంపెనీలను ప్రోత్సాహకాలు ఇవ్వడం లేదా పూర్తిగా మూసివేయడం చేయాలని పేర్కొంది. అలాగే సింగరేణి కంపెనీకి కూడా పలు సూచనలు చేసింది. ఓబీఆర్ కాంట్రాక్టుల్లో భద్రతా నిబంధనలు మార్చాలని, బొగ్గు రవాణా ఛార్జీలను సమీక్షించాలని సూచించింది. తవ్విన గనులను తిరిగి నింపడానికి నది ఇసుకకు బదులు ప్రాసెస్ చేసిన బూడిద లేదా గనుల ఉపరితల పదార్థాలను వాడాలని తెలిపింది.రాష్ట్రంలో మొత్తం 83 ప్రభుత్వ రంగ సంస్థలు ఉన్నట్టు, వాటిలో 16 సంస్థలు మూతపడినట్టు లేదా లిక్విడేషన్‌లో ఉన్నట్టు నివేదిక వెల్లడించింది. మిగిలిన 67 సంస్థల్లో 49 ఖాతాలు సమర్పించడంలో ఆలస్యం చేశాయని పేర్కొంది. దీంతో కేవలం 18 సంస్థల పనితీరే విశ్లేషణకు తీసుకున్నట్టు కాగ్ వెల్లడించింది. విశ్లేషణకు తీసుకున్న 18 సంస్థల్లో 11 నష్టాల్లో ఉన్నాయని, కేవలం 6 సంస్థలు మాత్రమే లాభాల్లో ఉన్నాయని కాగ్ తెలిపింది. తొమ్మిది సంస్థల నెట్ విలువ పూర్తిగా నష్టాలతో కరిగిపోయినట్టు వెల్లడించింది. 71 సంస్థలు సమయానికి ఖాతాలు సమర్పించకపోవడంపై ఆందోళన వ్యక్తం చేసింది. 15 సంస్థల్లో 9 స్వతంత్ర డైరెక్టర్ల నియామకం చేయలేదని, ఎక్కడా ఇండిపెండెంట్ డైరెక్టర్ల సమావేశాలు నిర్వహించలేదని పేర్కొంది. 5 సంస్థల్లో ఆడిట్ కమిటీ లేదని, 9 సంస్థల్లో ఎన్ఆర్సీ కమిటీ ఏర్పాటు కాలేదని తెలిపింది.

# లొంగిపోయిన మావోఇస్టు నారాయణరావు



(మొదటి పేజి (తరువాయి)

ఇప్పుడు కనుమరుగయ్యే పరిస్థితి వచ్చిందన్నారు. సాయుధ పోరాటాన్ని వదిలి.. జనజీవన స్రవంతిలో కలిసిపోవాలని తాను లొంగిపోయినట్లు నారాయణ చెప్పుకొచ్చారు. 1990లో ఉద్దానంలో ప్రజా ఉద్యమానికి ఆకర్షితులు అయ్యాను. అప్పుడే మావోయిస్టు పార్టీలో చేరాను. పార్టీ తీర్మానాలకు అనుకూలంగా పనిచేశాను. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖలో పనిచేశాను. నేను మావోయిస్టు ఉద్యమాల్లో చేరినపుడు పరిస్థితులు, ఇప్పుడు చాలా మారాయి. మేం పనిచేసిన ఆదివాసీ అటవీ ప్రాంతంలో అనేక మార్పులు వచ్చాయి. ప్రభుత్వం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అందిస్తోంది. ఎప్పటికప్పుడు పరిస్థితులకు అనుగుణంగా పార్టీ అప్డేట్ కాకపోవటమే ఈ వైఫల్యానికి కారణం. వాస్తవ పరిస్థితులకు విరుద్ధంగా పార్టీ నిర్ణయాలు తీసుకోవటంతో ఈ పరిస్థితి వచ్చింది. మావోయిస్టు పార్టీ పరిస్థితులకు అనుగుణంగా అప్డేట్ అవలేదు, అందుకే ఏవోబీ సహా దేశ వ్యాప్తంగా పార్టీ కనుమరుగు అయింది' అని నారాయణ వివరించారు. 'సమాజంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పార్టీ సిద్ధాంతాలు మారలేదు. అందువల్లే పార్టీ ఇలా అయింది. పార్టీ హత్య చేసిన ఘటనల్లో నేను కూడా భాగస్వామి అయ్యాను. అయితే పార్టీ నిర్ణయాల్లో భాగంగా మాత్రమే అవి జరిగాయి. నాకు ఎవరితో వ్యక్తిగత విభేదాలు, శత్రువుత్వం లేదు. జరిగిన ఘటనకు నేను పశ్చాత్తాపపడుతున్నా' అని మావోయిస్టు నారాయణ చెప్పారు. నారాయణరావు స్వస్థలం శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం బాతుపురం. ఆయన దాదాపు 35 ఏళ్లుగా అజ్ఞాతంలో ఉన్నారు. 1990లో పీపుల్స్ వార్‌లో చేరి అంచెలంచెలుగా ఎదిగారు. మిలిటరీ ఆపరేషన్స్‌లో దిట్ట అనే పేరు నారాయణకు ఉంది. ఏవోబీ స్పెషల్ జోనల్ కమిటీలో కీలకంగా వ్యవహరిస్తూ.. పార్టీ ఎదుగుదలకు కృషి చేశారు. ఏపీ, ఒడిశాల్లో అనేక కేసులు ఆయనపై ఉన్నాయి.

## ఒంటిమిట్ట రాముడి కళ్యాణానికి

# తిరుమల శ్రీవారి లడ్డూ



(మొదటి పేజి (తరువాయి)

బృందాల చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి ఊరేగింపు కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు.పురాణాల ప్రకారం.. కృష్ణుడు వెన్నదొంగ. రేపల్లెలో బాలకృష్ణుడు యశోదమ్మ ఇంట్లోనే గాక అందరి ఇళ్లలోకి వెళ్లి వెన్న ఆరగించేవారు. ఈ చిన్నికృష్ణుడి లీలలను గుర్తు చేస్తూ రాములవారు వెన్నకుండతో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో శ్రీమతి ప్రశాంతి, సూపరింటెండెంట్ శ్రీ హనుమంతయ్య, టెంపుల్ ఇన్స్పెక్టర్ శ్రీ నవీన్, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఇదిలావుంటే ఏప్రిల్ 1వ తేదీన ఎంతో ప్రతిష్టాత్మకంగా ఒంటిమిట్టలో జరిగే శ్రీ సీతా రాముల కల్యాణానికి విచ్చేసే భక్తులకు అందించేందుకు 85 వేల తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాలను సిద్ధం చేశారు. తిరుమలలోని శ్రీవారి సేవా సదన్ 1లో శ్రీవారి సేవకుల సహకారంతో లడ్డూల ప్యాకింగ్‌ను టీటీడీ ఒక బృహత్కార్యక్రమంగా నిర్వహించింది. ఈ లడ్డూల ప్యాకింగ్ కార్యక్రమంలో సుమారు 300 మంది శ్రీవారి సేవకులు అపార భక్తి, శ్రద్ధలతో పాల్గొన్నారు. తిరుమల ఎస్టేట్స్ అధికారి,డిప్యూటీ ఈవో వెంకటేశ్వరులు ఆధ్వర్యంలో లడ్డూ ప్యాకింగ్ నిరంతరాయంగా సాగింది. లడ్డూల ప్యాకింగ్, లోడింగ్, రవాణా వంటి అన్ని కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేశారని అన్నారు.

# ఫిర్యాదులు పునరావృతం కాకుండా న్యాయం

## శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ ఎస్ సతీష్‌కుమార్



**పుట్టపర్తి (తెలుగోడు), మార్చి 30 :**

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ఫిర్యాదులు పునరావృతం కాకుండా బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ ఎస్ సతీష్ కుమార్ ఆదేశించారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి మొత్తం 62 అర్జీలు స్వీకరించారు. అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించారు. కుటుంబ కలహాలు, సైబర్ మోసాలు, అత్తారింటి వేధింపులు, భూ-ఆస్తి వివాదాలు, నకిలీ పత్రాలు తదితర అంశాలపై ఫిర్యాదుదారులు తమ సమస్యలను వివరించారు.ఫిర్యాదులను విన్న అనంతరం సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమస్యలను చట్టపరమైన పరిమితుల్లో పరిష్కరించేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అంకిత సురాన, డిటిఆర్బి సీఐ లక్ష్మీ కాంత్ రెడ్డి, ఎయిర్‌పోర్ట్ సీఐ బొజ్జప్ప తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రైవేటు బస్సుల తనిఖీలు ముమ్మరం

**అమరావతి (తెలుగోడు), మార్చి 30 :**

ఏపీలో రోడ్డు ప్రమాదాల నివారణెళి ధ్యేయంగా రవాణ శాఖ తనిఖీలను ముమ్మరం చేసింది. నిబంధనలకు విరుద్ధంగా.. ఓవర్ లోడ్‌తో నడుపుతున్న ప్రైవేట్ బస్సులపై కఠిన చర్యలు తీసుకోవాలని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న టోల్ ప్లాజాలు, సరిహద్దు చెక్ పోస్టుల వద్ద రవాణా శాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఒక్కరోజే రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 976 ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులను తనిఖీ చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేకుండా నడుపుతున్న, నిబంధనలు ఉల్లంఘించిన 193 బస్సులపై కేసులు నమోదు చేసి, భారీగా జరిమానాలు విధించినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 16 ప్రధాన పాయింట్లలో ఈ తనిఖీలు నిరంతరాయంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రయాణికుల భద్రత విషయంలో ప్రభుత్వం రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కొంతమంది బస్సు యజమానులు ఇష్టానుసారంగా వాణిజ్య సరుకులను తరలిస్తూ.. అధిక లోడ్‌తో బస్సులను నడుపుతున్నారని చెప్పారు. భద్రతా నియమాలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ విధిగా నిబంధనలను పాటించాలని చెప్పారు.

## ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం

# చేసుకుంటాం

(మొదటి పేజి (తరువాయి)

చేసుకోవచ్చు.. చేసుకోకపోవచ్చు. కొన్నాళ్లు మా ఆధీనంలో ఉంచుకోవచ్చు. ఇరాన్ వద్ద ఆత్మరక్షణ కోసం ఇంకేమీ మిగలలేదని అనుకోవడం లేదు. కానీ, ఒక్కసారి మేం దాడి మొదలుపెడితే.. ఖర్గ్ ద్వీపాన్ని చాలా సులభంగా స్వాధీనం చేసుకుంటాం. ఇరాన్‌పై భూతల దాడులు చిట్టచివరి ఆప్షన్ మాత్రమే' అని ట్రంప్ పేర్కొన్నారు అంతేకాదు.. ఇరాన్ హర్మూజ్‌లో టోలు వసూలుచేస్తున్నట్లు వచ్చిన వార్తల పైనా ట్రంప్ స్పందించారు. అదే నిజమైతే అమెరికా దానిని రెండు నిమిషాల్లో మూసేయిస్తాయని భరోసా ఇచ్చారు. సౌదీ, ఖతార్, యూఏఈ, బహ్రెయిన్ దేశాలు ఇరాన్‌పై తిరగబడుతున్నాయన్నారు. ఇక అమెరికా యుద్ధనౌక యూఎస్ఎస్ ట్రిపోలి దాదాపు 3,500 మంది మెరైన్లతో పశ్చిమాసియాకు చేరుకొంది. ఇది ఈనెల 27న తమ సెంట్రల్ కమాండ్ పరిధిలోకి వచ్చినట్లు అధికారులు ధ్రువీకరించారు. యూఎస్ఎస్ ట్రిపోలిపై ఎఫ్-31లు సహా పలు యుద్ధ విమానాలను మోహరించవచ్చు. యూఎస్ఎస్ బాక్సర్‌తోపాటు శాన్‌డిగో నుంచి వచ్చిన ఇతర నౌకాదళ యూనిట్లు, అదనపు బలగాలూ పశ్చిమాసియాకు చేరుకున్నాయి.

# నితీష్‌కుమార్ రాజీనామా

(మొదటి పేజి (తరువాయి)

అధ్యక్షుడు నితిన్ నబిన్ కూడా బీహార్ శాసనమండలికి రాజీనామా చేశారు. ఆయన కూడా మార్చి 16న రాజ్యసభకు ఎన్నికయ్యారు. ఈ నేపథ్యంలో ఆయన కూడా శాసనమండలికి రాజీనామా చేశారు. కాగా, 2005లో ఎన్‌డిఎ కూటమి తరపున నితీష్‌కుమార్ ముఖ్యమంత్రి పదవిని చేపట్టారు. ఇక బిజెపికి మద్దతుగా, ఆ తర్వాత ఆ పార్టీని వ్యతిరేకిస్తూ మహాగట్బంధన్ వైపు మద్దతుగా నిలిచి తన సిఎం పదవిని కాపాడుకున్నారు. 2013, 2017, 2022, 2024లో పార్టీలు మారుతూ సిఎంగా కొనసాగారు. 2025లో అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి రికార్డు స్థాయిలో విజయం సాధించి పదవ సారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసి రికార్డు సృష్టించారు.

## ప్రియురాలి హత్య ముక్కలు చేసి

# ఫ్రిజ్‌లో దాచిన ఘాతుకం

(మొదటి పేజి (తరువాయి)

భాగాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. హత్య అనంతరం తల, కాళ్లు, చెప్పులు, సిమ్ కార్డులను సూట్‌కేసులో పెట్టుకుని దారపాలెం ప్రాంతానికి తీసుకెళ్లి తగలబెట్టినట్లు విచారణలో వెల్లడైంది. మూడేళ్ల క్రితం రవీంద్ర, మౌనిక మధ్య పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కొనసాగుతున్న సమయంలోనే అతను మరో యువతిని వివాహం చేసుకున్నాడు. దీనిపై మౌనిక తరచూ పెళ్లి చేసుకోవాలని, ఆర్థికంగా సహాయం చేయాలని ఒత్తిడి చేయడం ప్రారంభించింది. ఈ వేధింపుల నుంచి బయటపడేందుకు ముందుగానే ప్రణాళిక వేసుకుని భార్యను పుట్టింటికి పంపించిన రవీంద్ర, ఆ తర్వాతే ఈ హత్యకు పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని ప్రశ్నిస్తున్నారు. అత్యంత దారుణంగా జరిగిన ఈ హత్య విశాఖలో కలకలం రేపడంతో పాటు సమాజంలో పెరుగుతున్న హింసాత్మక ధోరణులపై ఆందోళన వ్యక్తమవుతోంది.

# ఆక్వా రైతులను వేధిస్తే సహించేది లేదు

(మొదటి పేజి (తరువాయి)

రైతును రికార్డుల పేరుతో వేధించడం తగదని అన్నారు. రైతు చెరువును పూడ్చుమని ఆదేశించడం అన్యాయమని పేర్కొన్నారు.ముడుపుల ప్రభావంతో కొందరు అధికారులు వ్యవహరిస్తున్నారని ఆరోపించిన ఆయన, రైతులపై ఇలాంటి చర్యలు కొనసాగితే సహించబోమని హెచ్చరించారు. రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

# ప్రజలను చంపేవారు దేశభక్తులా

(మొదటి పేజి (తరువాయి)

నిలిచారు. వేల మంది సైనిక బలగాలు, పోలీసులను నక్సల్స్ చంపారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన సైనికులకు శ్రద్ధాంజలి ఘటిస్తున్నాం. ఇప్పుడు ప్రతి ఒక్కరూ అభివృద్ధినే కోరుకుంటున్నారు.. హింస కాదు. బస్తర్ యువకులను కలిశా.. వాళ్లందరూ నక్సలిజాన్ని వ్యతిరేకించారు. ప్రస్తుత సమాజంలో నక్సలిజానికి తావు లేదు. ఎన్డిఎ పాలనలో మారుమూల ప్రాంతాల్లోనూ అభివృద్ధి జరుగుతోంది. నక్సలైట్ల ఎజెండాలో అభివృద్ధి అన్నది లేదు. నక్సలైట్లు తమ ఉనికి కోసమే పోరాడుతున్నారు. నక్సలైట్లు.. భగత్‌సింగ్, బిర్సాముండా కారు. వాళ్లతో నక్సలైట్లను పోల్చకూడదు. 'రోడ్లు, విద్యుత్ వంటి సదుపాయాలు లేకుండా గిరిజన ప్రాంతాలు ఎలా అభివృద్ధి చెందుతాయి. నక్సల్స్.. చిన్న పిల్లలకు తుపాకులు, ఆయుధ సామాగ్రి ఇచ్చారు. ఏజెన్సీ ప్రాంతాల యువత జీవితాలను నక్సల్స్ నాశనం చేశారు. నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో నిరక్షరాస్యత ఎక్కువగా ఉంది. విద్య, వైద్య, మౌలిక వసతులను కూడా నక్సల్స్ ధ్వంసం చేస్తున్నారు. మనం ప్రజాస్వామ్య దేశంలో ఉన్నాం.. రాజ్యాంగాన్ని స్వీకరించాం. ఆయుధాలు చేపట్టి ప్రజల ప్రాణాలు తీయాలని ఏ సిద్ధాంతాలు చెప్పాయి? ప్రజల ప్రాణాలు తీసే హక్కు ఎవరికీ లేదని నక్సల్స్ గ్రహించాలి. స్కూళ్లు, బ్యాంకులు, ఆస్పత్రులు తగలబెట్టేవారి వల్ల అభివృద్ధి ఎలా సాధ్యం? ఆయుధాలు చేతుల్లోకి తీసుకోవడం ఏ సమస్యకూ పరిష్కారం కాదు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల నుంచే నక్సలిజం అభివృద్ధి చెందింది. ఇందిరా గాంధీ వల్లే మావోయిస్టు పార్టీ అన్ని ప్రాంతాలకు విస్తరించిందని అమిషా ధ్వజమెత్తారు.

# లాకర్ వస్తువులకు బీమా కుదరదు

(మొదటి పేజి (తరువాయి)

కాబట్టి విలువ ఆధారంగా బీమా కవరేజీ అందించడం సాధ్యం కాదని తేల్చిచెప్పారు. ఈ మేరకు లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు ఈ అంశాన్ని లేవనెత్తగా ఆర్థిక మంత్రి దీనిపై స్పందించారు. 'లాకర్లలోని వస్తువులను బ్యాంకు సిబ్బంది తనిఖీ చేయలేరు. అలా చేయడం బ్యాంకు రూల్స్‌కి విరుద్ధం. ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం.. దొంగతనం, అగ్నిప్రమాదం, బ్యాంకుల్లో మోసాలు వంటి సందర్భాల్లో నష్టం వాటిల్లితే పరిహారం అందిస్తాయి. లాకర్ వార్షిక అ÷-దదెకు 100 రెట్లు పరిహారం చెల్లిస్తున్నాయి' అని ఆమె గుర్తుచేశారు. లాకర్లలోని వస్తువులను బ్యాంకులు తనిఖీలు చేయలేవు కాబట్టి విలువ ఆధారంగా పరిహారం అందించడం సాధ్యంకాదని స్పష్టం చేశారు. ప్రస్తుతానికి బీమా కవరేజీకి సంబంధించి కొత్త ప్రతిపాదనలేవీ పరిశీలనలో లేవని మంత్రి తెలిపారు.

# చైనా సిసి కెమెరాలు బ్యాన్

(మొదటి పేజి (తరువాయి)

భారత మార్కెట్లో హెక్ విషన్ , దాహువా, టీపీ-లింక్ వంటి చైనా కంపెనీల హవా నడుస్తోంది. అయితే.. ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానున్న కొత్త సర్టిఫికేషన్ నిబంధనల ప్రకారం.. ఇంటర్నెట్‌తో అనుసంధాన మయ్యే ఈ చైనా కంపెనీల నిఘా పరికరాల అమ్మకాలను భారత్‌లో నిలిపివేయనున్నారు. విమానాశ్రయాలు, ప్రభుత్వ భవనాలు, రవాణా కేంద్రాలు వంటి కీలక ప్రాంతాల్లో వీటిని ఉపయోగిస్తారు. ఈ క్రమంలో చైనా కెమెరాల ద్వారా దేశ భద్రతకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని భారత భద్రతా సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ కెమెరాల్లో రహస్యంగా 'బ్యాక్ డోర్' యాక్సెస్ ఉండే అవకాశం ఉందని, దీని ద్వారా సేకరించిన సమాచారం విదేశీ సర్వర్‌లకు చేరే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం భారత్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న సర్వైలెన్స్ మార్కెట్‌లలో ఒకటి. తాజా నిర్ణయం వల్ల చైనా కంపెనీలకు గట్టి దెబ్బ తగిలే అవకాశం ఉండగా.. భారతీయ తయారీదారులకు ఇది పెద్ద అవకాశంగా మారనుంది.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

## వైకాపా నేతలపై అక్రమాలు, దౌర్జన్యాలు సహించేది లేదు

**మాజీ శాసనసభ్యులు కేతిరెడ్డి పెద్దారెడ్డి..**

**తాడిపత్రి (తెలుగోడు), మార్చి 30 :**

తాడిపత్రి పట్టణంలో వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని జేసీ ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో కొనసాగుతున్న అక్రమాలు, దౌర్జన్యాలను సహించేది లేదని మాజీ శాసనసభ్యులు కేతిరెడ్డి పెద్దారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం బూత్ లెవెల్ ఏజెంట్ల నియామకంపై మాజీ శాసనసభ్యులు కేతిరెడ్డి పెద్దారెడ్డి తాడిపత్రి పట్టణం, రూరల్ మండలాలకు చెందిన వైయస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మాట్లాడుతూ తాడిపత్రి పట్టణంలో జేసీ ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో కొనసాగుతున్న అక్రమాలు, దౌర్జన్యాలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని బెదిరింపులు, ఒత్తిళ్లు తీసుకొస్తున్నారని మండిపడ్డారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ కౌన్సిలర్ చిన్న నాగిరెడ్డి పుట్లూరు రోడ్ నందు నిర్మిస్తున్న లాడ్జ్ ముందు ఉన్న మెటికలను మున్సిపాలిటీ అధికారులతో కలిసి ఉద్దేశపూర్వకంగా ధ్వంసం చేసిన ఘటనను తీవ్రంగా ఖండించారు. ఇది స్పష్టమైన అధికార దుర్వినియోగానికి నిదర్శనమని పేర్కొన్నారు.
ప్రజాస్వామ్యంలో ఇలాంటి దౌర్జన్యాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ తావులేదని, ప్రజల అండతో ప్రతి అన్యాయానికి తగిన సమాధానం ఇస్తామని స్పష్టం చేశారు. ఈకార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు.



సమావేశానికి భారీగా హాజరైన వైకాపా నేతలు, కార్యకర్తలు

## గుత్తి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శ్రీకాంత్ రెడ్డి ఎన్నిక

**గుత్తి (తెలుగోడు), మార్చి 30 :**

గుత్తి మండల బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది శ్రీకాంత్ రెడ్డి ఎన్నికయ్యారు. గుత్తి బార్ అసోసియేషన్‌కు సంబంధించి ఉపాధ్యక్షులు కార్యదర్శి ఇతర కార్యవర్గాలకు ఏకగ్రీవంగా సభ్యులను ఎన్నుకోగా ఒక్క అధ్యక్ష స్థానానికి మాత్రం పోటీ జరిగింది. పోటీలో సీనియర్ న్యాయవాదులు మనోహర్ బాబు మరియు శ్రీకాంత్ రెడ్డిలు పోటీపడ్డారు. పోటీలో శ్రీకాంత్ రెడ్డి 57 ఓట్లు సాధించి విజయం సాధించగా ప్రత్యర్థి మనోహర్ బాబుకు 36 ఓట్లు పోలైనట్లు తెలిపారు. దీంతో శ్రీకాంత్ రెడ్డి ఏడాది పాటు గుత్తి బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా కొనసాగనున్నారు. అధ్యక్షులుగా ఎన్నికైన శ్రీకాంత్ రెడ్డిని పలువురు సీనియర్ మరియు జూనియర్ న్యాయవాదులు ప్రత్యేకంగా అభినందించారు.



గుత్తి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీకాంత్ రెడ్డిని సన్మానిస్తున్న న్యాయవాదులు

## 1న సన్ రైజర్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్

***మొదటి బహుమతి 30 వేలు విన్నర్స్ కప్..***
***రెండవ బహుమతి 15వేలు రన్నర్స్ కప్..***
***పాఠశాల కరస్పాండెంట్ మారెన్న,***
***డైరెక్టర్లు డి. ఏం నాగభూషణ, డి.తిప్పేస్వామి..***

**బెళగుప్ప (తెలుగోడు), మార్చి 30 :**

బెళుగుప్ప ఎన్టీఆర్ స్టేడియంలో సన్ రైజర్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల వారి ఆధ్వర్యంలో ఏప్రిల్ 1 వ తేదీ బుధవారం నుండి జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ మారెన్న, పాఠశాల డైరెక్టర్లు డి.ఎం నాగభూషణ, డి.తిప్పేస్వామి పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత క్రికెట్ క్రీడాకారులను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ముఖ్యంగా ఈ టోర్నమెంట్ లో విజయం సాధించిన మొదటి జట్టుకు 30 వేల రూపాయల నగదు తో పాటు విన్నర్స్ కప్, రన్నర్స్ జట్టుకు రన్నర్స్ కప్ తో పాటు 15 వేల రూపాయల నగదును, అందిస్తూ మ్యాన్ ఆఫ్ ది సిరీస్ బహుమతులను కూడా అందజేస్తున్నామన్నారు. 1 వ తేదీ బుధవారం ముఖ్య అతిథుల చేత ఘనంగా ప్రారంభోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. అదేవిధంగా 1వ తేదీ నుండి జరగబోవు టోర్నమెంట్ లో ప్రతి మ్యాచ్ కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ బహుమతిని కూడా అందజేస్తామన్నారు. కావున బెళుగుప్ప కు సమీపంలోని ఉరవకొండ,కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల గ్రామీణ ప్రాంత క్రీడాకారులతో పాటు, కనేకల్,ఆత్మకూరు, మండలాలకు చెందిన గ్రామీణ క్రీడాకారులు కూడా పాల్గొనవచ్చును. ఇప్పటికే దాదాపు 30 టీం లకు పైగా నమోదు చేసుకున్నారన్నారు. కావున ఇంకా ఎవరైనా క్రికెట్ జట్లు ఈ బెళుగుప్ప లో జరగబోవు టోర్నమెంట్ లో పాల్గొనదలచిన జట్లు వెంటనే క్రికెట్ టోర్నమెంట్ ఆర్గనైజర్లు విజయ్ కుమార్ (9959923623), రుద్ర (7386251519) సంప్రదించి తమ జట్లను నమోదు చేసుకోవాలని నిర్వాహకులు టి.మారెన్న, డి.ఎం నాగభూషణ, డి. తిప్పేస్వామి పేర్కొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే క్రీడాకారులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాట్లను పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.




# పేదల సొంతింటి కళ సాకారమైన వేళ..

**తాడిపత్రిలో 1024 టిడ్కో గృహాల పంపిణీ..**
**పండుగ వాతావరణంలో గృహ ప్రవేశాలు..**
**లబ్ధిదారులలో వెల్లివిరిసిన ఆనందోత్సాహం..**
**జిల్లా కలెక్టర్ ఆనంద్ ..**
**శాసనసభ్యులు జేసీ అస్మిత్ రెడ్డి..**

**తాడిపత్రి (తెలుగోడు), మార్చి 30 :**

పేదల సొంతింటి కళలు సాకారమైన అరుదైన ఘడియగా తాడిపత్రి మండలం నిలిచింది. ఎన్టీఆర్ హౌసింగ్ టిడ్కో ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక గృహ ప్రవేశ కార్యక్రమం లబ్ధిదారులకు మహా వరంగా మారింది. గన్నేవారి పల్లె లేఔట్‌లో సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమం పండుగ వాతావరణాన్ని తలపించింది. అనంతపురం జిల్లాలో మంజూరైన సుమారు 5403 గృహాలలో భాగంగా, తాడిపత్రి మండల పరిధిలోని గన్నేవారి పల్లెలో నిర్మించిన గృహాలలో మొదటి దశగా 1024 మంది లబ్ధిదారులకు జిల్లా కలెక్టర్ ఆనంద్, శాసనసభ్యులు జేసీ అష్మిత్ రెడ్డి గృహాల తాళాలు, ధృవపత్రాలు అందజేసి ఘనంగా గృహ ప్రవేశాలు నిర్వహించారు. నూతన గృహాల్లో అడుగుపెట్టిన లబ్ధిదారులు ఆనందభాష్పాలతో పొంగిపోయారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున టిడ్కో గృహ ప్రవేశాలను ప్రారంభోత్సవాలు చేపట్టడం సంతోషకరమని తెలిపారు. హౌసింగ్ ఫర్ ఆల్ లక్ష్యంతో జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో నేడు 3099 మంది లబ్ధిదారులకు గృహ ప్రవేశాలు చేపట్టడం జరిగిందన్నారు. తాడిపత్రిలో మొత్తం 5184 గృహాలలో ఫేజ్-1 కింద 2304 గృహాలు నిర్మించగా, అందులో తొలి విడతగా 1024 మందికి గృహ ప్రవేశం కల్పించామని వివరించారు. మిగిలిన గృహాలను త్వరితగతిన పూర్తి చేసి, ఏప్రిల్ నెలాఖరుకు ఫేజ్-1 మొత్తం పూర్తి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. ఇంకా మిగిలిన 2880 గృహాలను ఆరు నెలలలోపు పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేస్తామని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో మంజూరైన ఎన్టీఆర్ హౌసింగ్ గృహాలను వర్షాకాలం ముందుగానే పూర్తి చేసి, అందరికీ సురక్షిత నివాసం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. లబ్ధిదారులు తమ ఇళ్ల నిర్మాణంపై స్వయంగా పర్యవేక్షణ చేయాలని, తమ అవసరాలకు అనుగుణంగా గృహాలను పూర్తి చేసుకోవాలని సూచించారు.
తాడిపత్రి శాసనసభ్యులు జేసీ అస్మిత్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ కాలంలో టిడ్కో గృహాలు పూర్తి స్థాయిలో అందుబాటులోకి రాలేదని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం పెండింగ్ పనులను పూర్తి చేసి, నాణ్యమైన గృహాలను అందించడంపై దృష్టి సారించిందని తెలిపారు. గృహాల నిర్మాణంతో పాటు డ్రైనేజీ వ్యవస్థ, రహదారులు, విద్యుత్ దీపాలు వంటి మౌలిక సదుపాయాలను సమగ్రంగా కల్పించడం జరిగిందన్నారు.
పేదవారి సొంతింటి కళ సాకారం కావడం ఈ ప్రభుత్వ లక్ష్యమన్నారు. మీ అందరికీ ఒక వినమ్ర విజ్ఞప్తియని మీకు కేటాయించిన గృహాలలో మీరే నివసించి, వాటిని సంరక్షించాలని లబ్ధిదారులను కోరారు. ఈ సందర్భంగా 1024 మంది లబ్ధిదారులకు గృహాల తాళం చెవులు, ధ్రువపత్రాలు స్వయంగా అందజేసి, వారికి శుభాకాంక్షలు తెలిపారు.
అనంతరం కలెక్టర్ ఆనంద్, ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి కలిసి టిడ్కో గృహాల శిలాఫలకాలను ఆవిష్కరించారు. లబ్ధిదారులకు భోజనం వడ్డించారు.
తాడిపత్రిలో జరిగిన ఈ గృహ ప్రవేశాల కార్యక్రమం ద్వారా పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడటంతో పాటు, తమ భవిష్యత్తుకు కొత్త ఆశలు కలిగించిందని, పేదల జీవితాల్లో ఒక కొత్త అధ్యాయానికి నాంది పలికిందని లబ్ధిదారులు ఎమ్మెల్యే జేసీ అష్మిత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో తాడిపత్రి మున్సిపాలిటీ ప్రత్యేక పాలనాధికారి డీఎం సివిల్ సప్లైస్ రమేష్ రెడ్డి, టిడ్కో ఈఈ సుధారాణి, తహసీల్దార్ సోమశేఖర్, మున్సిపల్ కమిషనర్ శివ రామకృష్ణ, హౌసింగ్ పీడీ శైలజ, బీజేపీ లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ ప్రతాప్ రెడ్డి, టీడీపీ నాయకులు ఎస్వీ రవీందర్ రెడ్డి, చింబిలి వెంకటరమణ, టీడీపీ నేతలు, తదితరులు పాల్గొన్నారు.



టిడ్కో గృహాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ ఆనంద్, ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఆనంద్, ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి





లబ్ధిదారులకు ఇంటి తాళం, ధృవీకరణ పత్రం అందజేస్తున్న కలెక్టర్ ఆనంద్, ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి
గృహ లబ్ధిదారులకు భోజనం వడ్డిస్తున్న కలెక్టర్ ఆనంద్, ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి

## దినస. బస్టాండ్. జంతువధశాల వేలం పాట

**యాడికి (తెలుగోడు), మార్చి 30 :**

యాడికి మేజర్ పంచాయితీ కార్యాలయంలో సోమవారం డిప్యూటీ ఎంపీడీవో శశికళ. సర్పంచ్ పందు అనురాధ. కార్యదర్శి అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో యాడికి మేజర్ పంచాయతీకి సంబంధించి దినసరి మార్కెట్. బస్టాండు. జంతువధశాల సుంకం వసూలు హక్కులను సోమవారం 10 గంటలకు వేలంపాట నిర్వహించారు. ఈ వేలం పాటలో ఒక్కొక్క దానికి ఒక్కొక్కరు పాడారు. దినసరి మార్కెట్‌ను శివకోటి రూ 4.00183కు పాడి దక్కించుకున్నారు . గతంలో రూ 3.83.200 పాడారు. బస్టాండును రాజశేఖర్ రూ 3.68.053కు పాడి దక్కించుకున్నారు గతంలో 3,49.600 పాడారు. జంతువధశాలను ఎం. నాగేంద్ర 58.860కు పాడి దక్కించుకున్నారు. గతంలో 56000 పాడారు. గత సంవత్సరాలకి ఈ సంవత్సరానికి పంచాయితీకి ఆదాయం 5.5 శాతం పెరిగింది. వేలపాటలో దక్కించుకున్న హక్కులు ఏప్రిల్ 1 నుండి 2027 మార్చి 31వ తేదీ వరకు ఉంటాయని పంచాయతీ కార్యదర్శి సాయి అరుణ్ కుమార్ తెలిపారు.



వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు డిప్టిక్ ఎంపీటీవో శశికళ కార్యదర్శి అరుణ్ కుమార్ సర్పంచ్ అనురాధ

## తాడిపత్రి ఆణిముత్యం చాంద్ హాఫీజ్ నవాజ్‌కు ఘన సత్కారం

**ఉద్యోగ, ఉపాధ్యాయ సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో సత్కారం..**

**తాడిపత్రి (తెలుగోడు), మార్చి 30 :**

సమాజ సేవే మహోన్నత ధ్యేయంగా భావిస్తూ, నిరుపేదల అభ్యున్నతికి కృషిచేస్తు, పేదల సేవ కోసం తపించు, ఆ సేవలోనే తరించు అనే సేవ దృక్పథంతో ముందడుగు వేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయ సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో యువ ప్రతిభావంతుడు చాంద్ హాఫీజ్ నవాజ్‌కు ఘన సత్కారం నిర్వహించారు. స్థానిక వివేకానంద పాఠశాలలో సోమవారం ఉద్యోగ, ఉపాధ్యాయ సామాజిక సేవా సంస్థ వర్కింగ్ ప్రెసిడెంట్ నారబోయిన శంకర్, ప్రెసిడెంట్ రామాంజనేయులు చాంద్ హాఫీజ్ నవాజ్‌కు పూలమాల వేసి, శాలువ కప్పి, మెమెంటో‌తో అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సేవా సంస్థ వర్కింగ్ ప్రెసిడెంట్ నారబోయిన శంకర్, ప్రెసిడెంట్ రామాంజనేయులు మాట్లాడుతూ విద్యార్థి దశలోనే అసాధారణ ప్రతిభ కనబరిచిన చాంద్ హాఫీజ్ నవాజ్ తాడిపత్రి ఆణిముత్యంగా అభివర్ణించారు.
సివి రామన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో తృతీయ సంవత్సరం ఇంజనీరింగ్ విద్యను అభ్యసిస్తు, విద్యతో పాటు సాంకేతిక రంగంలో విశేష ప్రతిభను ప్రదర్శిస్తూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతున్నారని తెలిపారు. ముఖ్యంగా ఐఐటీ ఖరగ్‌పూర్ నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి సైబర్ క్రైమ్ ఆన్‌లైన్ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, అనంతరం నిర్వహించిన పరీక్షలో సుమారు 90 వేల మంది పాల్గొనగా, ఇద్దరిలో ఒకరిగా ఎంపిక కావడం చాంద్ హాఫీజ్ నవాజ్ ప్రతిభకు నిదర్శనమని పేర్కొన్నారు.
చాంద్ హాఫీజ్ నవాజ్ సాధించిన విజయాలు అనేక పత్రికల్లో పతాక శీర్షికలుగా ప్రచురితమయ్యాయని, ఇది తాడిపత్రి యువతకు ప్రేరణగా నిలుస్తోందన్నారు. అనంతపురం జిల్లా సైన్స్ సెంటర్ అభివృద్ధికి తన వంతు కృషిగా ఉచితంగా వెబ్‌సైట్ మరియు ఆండ్రాయిడ్ యాప్ రూపకల్పన చేయడం విశేషమని తెలిపారు. ఈ యాప్‌ను జిల్లా విద్యాశాఖ అధికారి ప్రసాద్ బాబు ఆవిష్కరించి, ఆయన సేవలను అభినందించడం జరిగిందని గుర్తు చేశారు. ఈ సైన్స్ సెంటర్ వెబ్‌సైట్, ఆండ్రాయిడ్ యాప్ పాఠశాల విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. స్థానిక శాసనసభ్యులు జేసీ అష్మిత్ రెడ్డి కూడా చాంద్ హాఫీజ్ నవాజ్ ను తన కార్యాలయానికి పిలిపించి అభినందించి, భవిష్యత్తులో ఆయన చేపట్టే కార్యక్రమాలకు సంపూర్ణ సహకారం అందిస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. ఇప్పటికే పలు జాతీయ, అంతర్జాతీయ సంస్థలకు తన సేవలను అందిస్తూ, అనేక రివార్డులు అందుకున్న చాంద్ హాఫీజ్ నవాజ్ భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, చాంద్ హాఫీజ్ నవాజ్ భవిష్యత్తులో భారతదేశానికి గర్వకారణంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా చాంద్ హాఫీజ్ నవాజ్ మాట్లాడుతూ తనకు లభించిన ఈ సత్కారం మరింత బాధ్యతను పెంపొందించిందని, సమాజానికి ఉపయోగపడే సాంకేతిక పరిష్కారాలను అందించడమే తన లక్ష్యమని తెలిపారు. గ్రామీణ విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి తీసుకురావడమే తన ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ కన్వీనర్ శ్రీహరి, ట్రెజరర్ శ్రీరంగయ్య, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, చంద్రశేఖర్, కార్యదర్శి లక్ష్మీనారాయణ, సభ్యులు తిరుపాల్, మహమ్మద్ రఫీ, హాఫీజ్ నవాజ్ పాల్గొన్నారు.



చాంద్ హాఫీజ్ నవాజ్‌ను సత్కరిస్తున్న సేవా సంస్థ సభ్యులు శంకర్, రామాంజనేయులు



చాంద్ హాఫీజ్ నవాజ్ సన్మానంలో పాల్గొన్న సేవా సంస్థ సభ్యులు



హంస వాహనంపై రామయ్య

## హంస వాహనంపై సాక్షాత్కరించిన కోదండ రాముడు

**అనంతపురం కల్చరల్ (తెలుగోడు), మార్చి 30 :**

నగరంలోని ఒకటో రోడ్డు శ్రీ కాశీ విశ్వేశ్వర కోదండ రామాలయంలో శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలలో భాగంగా హంస వాహనమును అధిరోహించి భక్తులకు సాక్షాత్కరించారు. ఉదయం ఆలయంలో విశేష పూజలను నిర్వహించారు. సాయంత్రం రఘునందనడు బంగారు ఆభరణాలతో ధను ధారణలతో పట్టు పీతాంబరాలతో అలంకరించుకొని హంస వాహనంపై అధిరోహించి పురజనులకు సాక్షాత్కరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో నాగేంద్రుడు, చైర్మన్ నరేంద్ర చౌదరి ఆలయ అర్చకులు, పరమేశ్వరలు పాల్గొన్నారు.



గుత్తి ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య

## గుత్తి ఎక్సైజ్ స్టేషన్ తనిఖీ

**ఉమ్మడి జిల్లా ప్రొహిబిషన్ ,ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ పి. నాగమద్దయ్య ..**

**గుత్తి (తెలుగోడు), మార్చి 30 :**

పట్టణంలోని ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ను సోమవారం అనంతపురం జిల్లా ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ నాగ మద్దయ్య ఆకస్మికంగా పనిచేశారు. ఈ సందర్భంగా ఆయన ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించి నవోదయం 2.0 స్థితిని సమీక్షించారు. నాటుసారా పీడిత గ్రామాలను నాటుసారాపై నిరంతర దాడులు నిర్వహిస్తూ సార రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని, బైండోవర్లు, పెండింగ్ అరెస్ట్ లను వెంటనే పూర్తి చేయాలి, నవోదయం విజయవంతం చేయాలని తెలియజేసారు . ఈ సందర్భంగా ఆయన ఎన్ డి పి ఎస్ మరియు ఎన్ డి పి ఎల్ నేరాలను కూడా సమీక్షించారు. గుత్తి పట్టణంలోని రెస్టారెంట్ బార్ తనిఖీ చేసినారు, అనుమానిత ప్రదేశాలలో ఎన్ డి పి ఎస్ నేరాలపై నిఘా సేకరించడానికి మరియు మాదకద్రవ్యాల వ్యాపారులను పట్టుకోవడానికి మరిన్ని సూచనలు జారీ చేశారు. ఎక్సైజ్ ఐ యాప్ ద్వారా ఉల్లంఘనల ను అరికట్టడానికి దుకాణాలు మరియు 2బి బార్‌ల పై నిరంతర నిఘా కోసం డిప్యూటీ కమిషనర్ సిబ్బందికి పలు సూచనలు జారీ చేశారు. మరియు మరోవైపు నేరాలు మరియు ఎన్ డి పి ఎస్ నేరాల ప్రవాహాన్ని తగ్గించడానికి కూడా సూచనలు జారీ చేశారు. గుత్తి ప్రొహిబిషన్ ఉ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్, సబ్-ఇన్స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## గుత్తిలో గ్యాస్ కొరత ఉందంటూ అసత్య ప్రచారం

***అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు***
***గుత్తి సి.ఐ రామారావు.***

**గుత్తి (తెలుగోడు), మార్చి 30 :**

గుత్తిలో గ్యాస్ కొరత ఉందంటూ అసత్య ప్రచారాలు చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని గుత్తి సి.ఐ రామారావు అన్నారు. ఇటువంటి అసత్య ప్రచారాలకు స్వస్తి పలకాలని ఆయన సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. గత మూడు వారాల్లో సుమారు 19 వేల సిలిండర్లు పంపిణీ చేసిన గ్యాస్ ఏజెన్సీలపై ఉద్దేశపూర్వకంగా అసత్య ప్రచారాలు చేయడం సరైనది కాదన్నారు. గుత్తిలో గ్యాస్ కొరత లేకపోయినా ఉదంటూ కొందరు అసత్య ప్రచారం చేస్తున్నారు. భర్త సంసారాన్ని పట్టించుకోవడం లేదనే బాధతో ఓ వివాహిత ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నిస్తే దానిని పశ్చిమ ఆసియా యుద్ధ నేపథ్యంలో గ్యాస్ కొరతంటూ ముడిపెట్టారు. గ్యాస్ సిలిండర్ తీసుకురమ్మని నెలలుగా చెబుతున్నా భర్త పెడచెవిన పెట్టడం వల్లనే ఆ వివాహిత బాధపడి ఆత్మహత్యాయత్నానికి యత్నించింది అయితే కొందరు అసత్య ప్రచారం చేస్తున్నారు. సమాజంలో ఆందోళనలు తలెత్తేలా ప్రచారం చేస్తే చర్యలు తప్పవని గుత్తి సి.ఐ రామారావు పేర్కొన్నారు.





ఉచిత కంటి శిబిరాల పోస్టర్లను విడుదల చేస్తున్న హరీష్ బాబు

# ధర్మవరంలో ఉచిత కంటి శిబిరం

**మంత్రి సత్య కుమార్ యాదవ్ సేవా దృక్పథానికి నిదర్శనం.. హరీష్ బాబు..**

**బత్తలపల్లి (తెలుగోడు), మార్చి 30:** ధర్మవరం నియోజకవర్గ ప్రజల ఆరోగ్య సంక్షేమం కోసం మంత్రి సత్య కుమార్ యాదవ్ కృషి చేస్తున్నారని ఇన్‌చార్జ్ హరీష్ బాబు తెలిపారు.మంత్రి చొరవతో సంస్కృతి సేవా సమితి సహకారంతో శంకర నేత్రాలయ మొబైల్ యూనిట్ ఆధ్వర్యంలో ఉచిత కంటి శిబిరం పోస్టర్‌ను బత్తలపల్లిలో విడుదల చేశారు.ఏప్రిల్ 8 నుంచి 14 వరకు ప్రతిరోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ధర్మవరం పోతుకుంట ఏరియా ఆసుపత్రిలో శిబిరం నిర్వహించబడుతుంది. ఎంపికైన రోగులకు ఏప్రిల్ 12 నుంచి 16 వరకు ఉచిత కంటి ఆపరేషన్లు చేయనున్నారు. ఈ శిబిరంలో కంటి పరీక్షలు, దృష్టి లోపాల నిర్ధారణ, వ్యాధుల చికిత్స, ఉచిత ఐఓఎల్ ఆపరేషన్లు, బీపీ-షుగర్ పరీక్షలు, ఆపరేషన్ అనంతర సేవలు అందిస్తారు.ఈ కార్యక్రమం పూర్తిగా ఉచితమని, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని లబ్ధి పొందాలని హరీష్ బాబు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సాకే ఓబులేష్, మండల అధ్యక్షులు ఆకులేటి భాస్కర్ , మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి కోటి సుధా, ఆకులేటి వీరనారప్ప, కావేటి మల్లికార్జున, సురేంద్ర నాయుడు, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర రెడ్డి, మాజీ సింగిల్ విండో వెంకట చౌదరి తదితరులు పాల్గొన్నారు.



ఈ ఓ ఆర్ డి ప్రసాద్ సమక్షంలో వేలంపాట నిర్వహిస్తున్న దృశ్యం

# బహిరంగ వేలం పాట

**పంచాయతీకి రూ.5.50 లక్షల ఆదాయం ..**

**అమరాపురం (తెలుగోడు), మార్చి 30:** అమరాపురం పంచాయతీ కార్యాలయంలో ఎంపీడీవో రామారావు ఆదేశాల మేరకు ఈ.వో ఆర్. డి.. ప్రసాద్ ఆధ్వర్యంలో వారపు సంత, దినసరి మార్కెట్, బస్టాండ్ ప్రాంతం బహిరంగ వేలం నిర్వహించినట్లు పంచాయతీ కార్యదర్శి యోగానంద తెలిపారు. ా అమరాపురం వారపు సంతకు వేలంలో మూడు లక్షల రూపాయలు , దినసరి మార్కెట్ వేలం లక్ష 20,000 రూపాయలు ఈ రెండింటిని అమరాపురం గ్రామానికి చెందిన చిత్ర శేఖర యాదవ్ వేలంపాటలో పాట పాడి దక్కించుకున్నారు. బస్టాండ్ ప్రాంతాన్ని వేలం పాటలో లక్ష 50 వేల రూపాయలకు అమరాపురం గ్రామానికి చెందిన మంజునాథ్ వేలంలో దక్కించుకున్నారు. ఈ బహిరంగ వేలంలో పంచాయతీకి 5 లక్షల 50 వేల రూపాయలు ఆదాయం వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జూనియర్ సహాయకులు సవిత, పంచాయతీ సిబ్బంది, వేలం పాటదారులు గ్రామస్తులు ఉన్నారు.



వేలంపాటలో వారపు సంత, దినసరి సంత దక్కించుకున్న చిత్రశేఖర్ యాదవ్. వేలంలో బస్టాండ్ ప్రాంతాన్ని దక్కించుకున్న మంజునాథ్

# పేదోడికి ఒక న్యాయం.. పెద్దోడికి మరో న్యాయం..

**హెచ్‌పి గ్యాస్ ఏజెన్సీ చేతివాటం.. సామాన్యుల విలవిల..**

**బత్తలపల్లి (తెలుగోడు), మార్చి 30:** బత్తలపల్లి మండల కేంద్రంలో హెచ్‌పి గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు నిబంధనలను పట్టించుకోకుండా, సామాన్య వినియోగదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పేదోడికి ఒక న్యాయం.. పెద్దోడికి ఒక న్యాయం అన్నట్లుగా ఏజెన్సీ వ్యవహారం సాగుతోందని వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత పది రోజుల క్రితం గ్యాస్ పంపిణీ సమయంలో, కేవలం ఈనెల 16వ తేదీ లోపు బుక్ చేసుకున్న వారికి మాత్రమే గ్యాస్ ఇస్తామని నిర్వాహకులు ప్రకటించారు. అయితే, గత పది రోజులుగా సాధారణ వినియోగదారులకు "స్టాక్ లేదు" అంటూ గ్యాస్ ఇవ్వకుండా, మరోవైపు పలుకుబడి ఉన్న వారికి, అధిక ధరలకు కొనుగోలు చేసే వారికి గుట్టుచప్పుడు కాకుండా సిలిండర్లు సరఫరా చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.గ్యాస్ కొరతను సాకుగా చూపుతూ కృత్రిమ కొరత సృష్టించి అక్రమార్జనే లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఏజెన్సీలో జరుగుతున్న ఈ అక్రమాలను పర్యవేక్షించాల్సిన సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. వినియోగదారులు గ్యాస్ కోసం పడిగాపులు కాస్తున్నా, అధికారులు స్పందించకపోవడం వెనుక కారణమేమిటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, గ్యాస్ ఏజెన్సీ అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి, సామాన్య వినియోగదారులకు గ్యాస్ సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

**పేదవారి సొంత ఇంటి కలనెరవేర్చడమే**

# కూటమి ప్రభుత్వం ముఖ్య ఉద్దేశ్యం

**ఎన్టీఆర్ గృహం పారంభం.. టిడిపి జిల్లా అధ్యక్షులు ఎమ్మెల్యే రాజు.. రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి..**

**మడకశిర/అగళి (తెలుగోడు), మార్చి 30:** ప్రతి పేదవాడి సొంత ఇంటి కల నెరవేర్చడమే కూటమి ప్రభుత్వం ముఖ్య ఉద్దేశమని జిల్లా టిడిపి అధ్యక్షులు, టిటిడి బోర్డు మెంబర్ ఎమ్మెల్యే రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పేర్కొన్నారు. సోమవారం మడకశిర పట్టణంలోని 16వ వార్డు హోంగార్డ్ కాలనీలో హోంగార్డ్ బాలరాజు నిర్మించుకున్న ఎన్టీఆర్ గృహాన్ని ఎమ్మెల్యే రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హత గల ప్రతి పేదవారికి ప్రభుత్వం ఇల్లు ఇస్తుందన్నారు. పిఎంఎవై.బిఎల్‌సి, అర్బన్ స్కీమ్ ద్వారా లబ్ధిదారుడు బాలరాజు ఎన్టీఆర్ గృహకల్ప పథకంలో 2 లక్షల 50 వేల రూపాయలతో గృహం నిర్మించకున్నారన్నారు. పేదల సొంత ఇంటి కల నెరవేర్చడమే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమన్నారు. ఆ దిశగా ఆయన ముందుకు వెళ్తున్నారని తెలిపారు.

గత వైసీపీ పాలనలో పేదల ఇంటి కలను నిర్వీర్యం చేశారని అన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, లబ్ధిదారులు



ఎన్టీఆర్ గృహాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి

ఎన్టీఆర్ గృహాల లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకుంటే నాటి వైసీపీ ప్రభుత్వం బిల్లులు చెల్లించక ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల నోట్లో మట్టి కొట్టారని వారు అని అన్నారు. పేదలను ఆదుకునేందుకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతూ మరోవైపు అభివృద్ధిలో ముందుకు దూసుకు వెళుతుందన్నారు. నియోజకవర్గంలో ఉన్న అర్హులైనటువంటి ప్రతి ఒక్కరికి ప్రభుత్వ ఇల్లు మంజూరు చేయిస్తామన్నారు. అందులో భాగంగానే పదివేల మందికి ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా మడకశిర నియోజకవర్గంలో పండుగ వాతావరణంలో జరిగిందన్నారు. పార్టీల కతీతంగా అర్హులైన ప్రతి పేదవారికి సొంత ఇంటి నిర్మించుకునేందుకు అన్ని విధాలుగా సహాయ సహకారాలుఅందిస్తాం అని అన్నారు.ఈ కార్యక్రమం లో హౌసింగ్ ఏడి శివకుమార్. ఏఈ నాగభూషణ్.మున్సిపల్ కమిషనర్ జగన్నాథ్. మున్సిపల్ ఏఈ మురళి. పట్టణ అధ్యక్షుడు నాగరాజు. మండల కన్వీనర్ నాగరాజు. సుబ్బారెడ్డి.గృహ నిర్మాణ శాఖ సిబ్బంది ఏఈలు.వర్క్ ఇన్స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# పిఆర్‌సి సాధనకై రణభేరి-3 విజయవంతం చేయండి

**యూటీఫ్ నాయకులు..**

**రొళ్ల (తెలుగోడు), మార్చి 30:** పిఆర్‌సి సాధనకై రణభేరి-3 విజయవంతం చేయాలని యూటీఫ్ నాయకులు పిలుపునిచ్చారు. మడకశిర పట్టణంలోని ప్రాథమికోన్నత పాఠశాల 4వ వార్డులో యూటీఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వి ఎన్ . మాలింగప్ప, వై.జోగప్ప ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యసాయి జిల్లా యుటిఎఫ్ గౌరవాధ్యక్షులు కే. భూతన్న, జిల్లా కార్యదర్శి డి. నరసింహప్ప మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 22 నెలలు కావస్తున్న ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని పి ఆర్ సి కమిటీ వేసి చైర్మన్‌ను నియమించాలని, 29శాతం ఐర్ ను విడుదల చేయాలని, బకాయి పడ్డ డిఎలను విడుదల చేయాలని, పెన్షనర్స్ ఆర్థిక సమస్యలను పరిష్కరించాలని,హెల్త్ కార్డ్స్ మెడికల్ బిల్స్,సీపీస్ ను రద్దుచేసి ఓ పి ఎస్ ను అమలు చేయాలని అనే డిమాండ్లతో పుట్టపర్తి కేంద్రంలో ఏప్రిల్ 01 న యూటీఫ్ ఆధ్వర్యంలో చేపట్టబోవు రణభేరి- 3 నిరాహారదీక్షకు మడకశిర ప్రాంతం నుంచి అధిక సంఖ్యలో యూటీఫ్ కామ్రేడ్స్ తరలి రావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మడకశిర మండల గౌరవ అధ్యక్షులు ఈ. నరసింహమూర్తి, తాలూకా సమన్వయకర్త టీ. మూడ్లగిరియప్ప, గుడిబండ మండల ప్రధాన కార్యదర్శి జి ఎల్ కదురన్న,కేటీ హనుమంతరాయ, నంజప్ప దేవరాజు, ఎన్.రామాంజప్ప పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న యూటీఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు కె .భూతన్న



రణభేరి పోస్టర్లు విడుదల చేస్తున్న యూటీఫ్ నాయకులు





శ్రీ మారెమ్మ దేవిని ఊరేగింపుగా తీసువస్తున్న దృశ్యం. శ్రీ మారెమ్మ దేవికి జలధి వద్ద పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

# వలసలో శ్రీ మారెమ్మ దేవి జలధి ఉత్సవం

**అమ్మవారి ఊరేగింపు..**

**అమరాపురం (తెలుగోడు), మార్చి 30:** మండల పరిధిలోని వలస గ్రామంలో వెలసిన పురాతన కాలం నాటి దేవాలయం శ్రీ మారెమ్మ దేవి దేవాలయం. భక్తులు సోమవారం జలది ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వలస గ్రామంలో మారెమ్మ దేవాలయం నుంచి అమ్మవారి విగ్రహాన్ని మేళతాళాలతో సోమవారం తెల్లవారుజామున గ్రామ పురవీధుల గుండా వంక వద్దకు తీసుకొని వెళ్లారు. అక్కడ అమ్మవారిని గంగాజలంతో శుద్ధి చేశారు. వివిధ రకాల మంత్రాలతో పూజలు చేసి భక్తులు తెచ్చిన వివిధ పూలతో ప్రత్యేకంగా . అలంకరించి మహా మంగళ హారతి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా వలస, వీరప సముద్రం, నడు లుడము గ్రామాలనుంచే కాక మండలంలోని వివిధ గ్రామాల తో పాటు కర్ణాటక ప్రాంతానికి చెందిన భక్తులు తరలివచ్చారు. అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు చేశారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని మేళతాడాలతో ఊరేగింపుగా స్థానిక చింత తోపు వద్దకు తీసుకొని వచ్చి కూర్చోబెట్టి ప్రత్యేకంగా అలంకరణ చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేయించారు. ఈ సందర్భంగా వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ, గ్రామస్తుల ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు పెద్ద జాతర కావడంతో వలస గ్రామం భక్తులతో కిటకటలాడింది.



భక్తులకు ప్రసాదం అందిస్తున్న దృశ్యం





జలధివద్ద మహిళలు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం. జలధి వద్దకు తరలివచ్చిన భక్తులు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతు‌న్న జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఎం ఎస్ రాజు

# రేపు జిల్లా టీడీపి కార్యాలయం ప్రారంభం

**హాజరుకానున్న మంత్రులు అనగాని, మంత్రి సవితమ్మ.. జిల్లా టీడీపీ అధ్యక్షులు ఎం.ఎస్.రాజు..**

**రొళ్ల (తెలుగోడు), మార్చి 30:** శ్రీసత్యసాయిజిల్లా టీడీపీ కార్యాలయం ప్రారంభోత్సవం ఏప్రిల్ 1న నిర్వహించనున్నట్లు మడకశిర శాసనసభ్యులు, టీటీడీ పాలకమండలి సభ్యులు శ్రీసత్యసాయిజిల్లా టీడీపీ అధ్యక్షులు ఎం.ఎస్.రాజు తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లావ్యాప్తంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎం.ఎస్.రాజు మాట్లాడుతూ పుట్టపర్తి పోలీస్ పరేడ్ గ్రౌండ్ దారిలో అమూల్య లే అవుట్ పక్కన నిర్మించిన జిల్లా పార్టీ కార్యలయం ప్రారంభోత్సవానికి ఏప్రిల్ 1న జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు అనగాని సత్యప్రసాద్, మంత్రివర్యులు సవితమ్మ, జిల్లా ఎమ్మెల్యేలు, నాయకులు పెద్దఎత్తున హాజరవుతున్నారని తెలిపారు.

రాష్ట్రాభివృద్ధిలో తెలుగుదేశంపార్టీ కీలకపాత్ర పోషిస్తోందన్నారు. రాష్ట్రానికి తలమానికంగా నిలిచే రాజధాని విషయంలో కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబుగారు, మంత్రి నారా లోకేష్ కీలకమైన నిర్ణయం తీసుకుని రాష్ట్ర ప్రజలకు, పెట్టుబడి దారులకు మనోస్థైర్యాన్ని నింపారన్నారు. రాష్ట్ర రాజధానిగా అమరావతిని నిర్ణయిస్తూ రాష్ట్ర అసెంబ్లీలో చారిత్రాత్మక తీర్మానం చేశారని, ఆ చారిత్రాత్మక ఘట్టం తెలుగుదేశంపార్టీకి, కూటమి ప్రభుత్వం సొంతం. రాష్ట్ర ప్రయోజనాలు చంద్రబాబుతో సాధ్యమన్నారు. జగన్మోహన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో రాష్ట్రం అధోగతిపాలైంది. రాష్ట్రానికి రాజధాని ఏదో చెప్పుకోలేని దుస్థితి ఏర్పడిందన్నారు. రాష్ట్ర రాజధాని విషయంపై తీర్మానం చేసే సమయంలో కూడా జగన్మోహన్ రెడ్డి, తన పార్టీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి రాలేదంటే రాష్ట్రం పట్ల, రాష్ట్ర ప్రజల ప్రయోజనాల పట్ల వైసీపీకి ఉన్న చిత్తశుద్ధి ఏంటో ఆరోజే రుజువైందన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ప్రజలకు ఉపయోగపడే పరిపాలన జరగలేదని, జగన్మోహన్ రెడ్డి, తన పార్టీ నేతలు జేబులు నింపుకునే దోపిడీ పాలన సాగిందని తేటతెల్లమైందన్నారు. కూటమి పాలన వచ్చిన తర్వాత పెట్టుబడులు రాష్ట్రానికి వెల్లువెత్తుతున్నాయని, పెట్టుబడిదారులు కూడా ధైర్యంగా రాష్ట్రానికి వస్తున్నారన్నారు. రాష్ట్రం మరింత అభివృద్ధి చెందబోతుందన్నారు.ఈ శుభతరుణంలో శ్రీసత్యసాయిజిల్లా టీడీపీ కార్యాలయం ఏర్పాటు చేసుకునే అవకాశం రావడం ఆనందంగా ఉందన్నారు.ఈ కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు వేలాదిగా హాజరై జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నానని ఎం.ఎస్.రాజు అన్నారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మన ఊరు - మన జెండా కార్యక్రమం విజయవంతం చేయండి

**ప్రతి గ్రామంలో బీజేపీ జెండా ఎగరాలి.. బూత్ స్థాయిలో పార్టీ బలోపేతమే లక్ష్యం.. కార్యకర్తలకు దిశానిర్దేశం.. మంత్రి కార్యాలయ ఇన్చార్జ్ హరీష్ బాబు ..**

**బత్తలపల్లి (తెలుగోడు), మార్చి 30:** రాష్ట్ర భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో చేపడుతున్న "మన ఊరు -- మన జెండా" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ కార్యాలయ ఇన్‌చార్జ్ హరీష్ బాబు పిలుపునిచ్చారు.బత్తలపల్లి మండల కేంద్రంలోని ఆర్కే ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ముఖ్య సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి, పార్టీ నాయకులు, కార్యకర్తలతో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏప్రిల్ 6న పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం పార్టీకి ఎంతో ప్రాధాన్యత కలిగినదని పేర్కొన్నారు.ఈ కార్యక్రమం ద్వారా గ్రామ స్థాయి నుండి బూత్ స్థాయి వరకు పార్టీని బలోపేతం చేయడమే ప్రధాన లక్ష్యమని తెలిపారు. గ్రామాల వారీగా కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలని, ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.ప్రతి గ్రామంలో పార్టీ జెండా గర్వంగా ఎగరేలా పండుగ వాతావరణంలో కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. ఇది కేవలం ఒక కార్యక్రమంగా కాకుండా ప్రజలతో మమేకం అయ్యే ఉద్యమంగా తీసుకోవాలని నాయకులకు సూచించారు.ప్రతి కార్యకర్త బాధ్యతతో పనిచేస్తే నియోజకవర్గంలో పార్టీ మరింత బలపడుతుందని హరీష్ బాబు విశ్వాసం వ్యక్తం చేశారు.ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సాకే ఓబులేష్, మండల అధ్యక్షుడు భాస్కర్, మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి కోటి సుధా, ఆకులేటి వీరనారప్ప, కావేటి మల్లికార్జున, సురేంద్ర నాయుడు, వెంకటేశ్వర్ రెడ్డి, వెంకట చౌదరి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కార్యాలయం ఇన్చార్జి హరీష్ బాబు

# వ్యాపార, దుకాణాదారులు కమర్షియల్ సిలిండర్లే వాడాలి

**తహసీల్దార్ లక్ష్మీ నరసింహ..**

**అమరాపురం (తెలుగోడు), మార్చి 30:** మండలంలో వ్యాపార, దుకాణదారులు కమర్షియల్ సిలిండర్లు మాత్రమే ఉపయోగించాలని తహసీల్దార్ లక్ష్మీనరసింహ, ఎస్సై వలి బాషా తెలిపారు. సోమవారం స్థానిక ఐకెపి కార్యాలయంలో మండలంలోని హోటళ్లు, పానీపూరి సెంటర్ల నిర్వాహకులతో సమావేశం నిర్వమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కమర్షియల్ సిలిండర్లు కాకుండా ఇంటికి వాడే సిలిండర్లు వాడితే అపరాధ రుసుం విధించడంతోపాటు శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మంగళవారం నుంచి అధికారులు ఎప్పుడైనా తనిఖీ చేయవచ్చని, అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో హోటల్ యజమానులు, చిల్లర వ్యాపారస్తులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ లక్ష్మీనరసింహ





మాట్లాడుతున్న ఎస్సై వలి బాషా, హాజరైన హోటళ్లు, యజమానులు



కోసిగి పంచాయతీ వేలం పాట నిర్వహిస్తున్న దృశ్యం

## భారీ పోలీస్ బందోబస్తు మధ్య కోసిగి పంచాయతీ వేలాలు

**కోసిగి (తెలుగోడు), మార్చి 30 :**
భారీ పోలీస్ బందోబస్తు మధ్య సర్పంచ్ అయ్యమ్మ అధ్యక్షత న డీఎల్ డిఓ బాలకృష్ణ రెడ్డి,డీఎల్ పి ఓ తిమ్మక్కల ఆధ్వర్యంలో సోమవారంనాడు కోసిగి పంచాయతీ కి 2026-2027 సంవత్సరం కు సంబంధించి వేలం పాటలు రసవత్తరంగా జరిగాయి. ఈ వేలం పాటలో గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం పంచాయతీ కి ఆదాయం తక్కువ వచ్చిందని డిఎల్ పి ఓ తిమ్మక్క విలేకరుల కు తెలిపారు. బండి మెట్ట ఈ సంవత్సరం 14 లక్షల 60 వేలకు కోసిగి కి చెందిన పెండెకంటి కోసిగయ్య, అలియాస్ కప్పయ్య వేలం పాటలో దక్కించుకోవడం జరిగిందన్నారు.అలాగే వారపు సంత మార్కెట్ ను కూడా లక్ష రూపాయలకు కప్పయ్య యే దక్కించుకోవడం జరిగిందని ఆమె తెలిపారు.
.చిన్న కమేల 30 వేలకు కోసిగికి చెందిన కలందర్ దక్కించుకోగా ,.అలాగే పెద్ద కమేల 25 వేల రూపాయలకు కోసిగి కి చెందిన సంజీపోగు తాయన్న దక్కించుకోవడం జరిగిందన్నారు.. వేలం పాడిన పాటదారుడు తాను పాడిన మొత్తంలో సగం నగదు ఈ నెల 31 తారీఖు లోపు పంచాయతి కి చెల్లించాలని మిగిలిన మొత్తాన్ని మూడు నెలల లోపు చెల్లించవలసి ఉంటుందన్నారు.కొత్తగా వేలం పాట పాడి దక్కించు కున్న వారు వచ్చేనెల అనగా ఏప్రిల్ ఒకటవ తేదీ నుండి వసూలు చేయవలసి ఉంటుందని వారు తెలిపారు.జరుగుతున్న. వేలంపాటలను సిఐలు కోసిగి సిఐ మంజునాథ్ ,మంత్రాలయం సిఐ రామాంజులు ఆధ్వర్యంలో కోసిగి ఎస్సై రమేష్ రెడ్డి , పెద్ద కడబూర్ ఎస్సై మారుతి, మాధవరం విజయ్ కుమార్ ఆధ్వర్యంలో గట్టిపోలిస్ బందోబస్తు నిర్వహించారు.అనంతరం కోసిగి ఎస్సై రమేష్ రెడ్డి పంచాయతీ వేలాల్లో వేలం పాట పాడి దక్కించుకున్న వారికి సలహాలు, పలు సూచనలు ఇవ్వడం జరిగింది. ఇందులో అధికారులు ఈ ఓపిఆర్డీ ఈశ్వరయ్య స్వామి కోసిగి ఇంచార్జి పంచాయతి కార్యదర్శి రంగస్వామి నాయకులు ముత్తురెడ్డి, మాణిక్యరాజు నాడిగేని అయ్యన్న నర్సారెడ్డి తోవి రామ కృష్ణ , వక్రాని వెంకటేశులు కొండగేని వీరారెడ్డి నాడిగేని తాయన్న, నాడిగేని వీరారెడ్డి మహాదేవ, హాలగుంద కోసిగయ్య, తదితరులు పాల్గొన్నారు.

## సీఎం చంద్రబాబు నాయుడును కలిసిన ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్ కుమార్

**గూడూరు (తెలుగోడు), మార్చి 30:**
ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయుడుపేట పర్యటనలో భాగంగా టిడ్కో ఇళ్ల ప్రారంభానికి వచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రిని గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్ కుమార్ చంద్రబాబు నాయుడుని మర్యాదపూర్వకంగా కలిశారు.



# కూటమి ప్రభుత్వంతో పేదల సొంతింటి కల సాకారం

### మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జ్ రాఘవేంద్ర రెడ్డి..

**పెద్దకడబూరు (తెలుగోడు), మార్చి 30:**
కూటమి ప్రభుత్వంతోనే పేదల సొంతింటి కల సాకారమయిందని మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జ్ ఎన్. రాఘవేంద్ర రెడ్డి అన్నారు. సోమవారం పెద్దకడబూరు మండల పరిధిలోని కంబలదిన్నె గ్రామంలో ఎంపీడీఓ ప్రభావతి దేవి ఆధ్వర్యంలో ప్రధానమంత్రి అవాస్ యోజన (పీఎంఏవై) పథకం కింద మంజూరైన గృహాల గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాఘవేంద్ర రెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు గవిగట్టు ఈరన్న, టీడీపీ యువనేత రాజారెడ్డి, సొసైటీ ఛైర్మన్లు కందనాతి నరసప్ప, తలారి మీ సేవ ఆంజనేయులు హాజరై లబ్ధిదారులతో కలిసి నూతన గృహప్రవేశాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా టీడీపీ ఇన్ చార్జ్ రాఘవేంద్ర రెడ్డి మాట్లాడుతూ పేద ప్రజలకు సురక్షితమైన నివాసాన్ని కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఇచ్చిన హామీ ప్రకారం కేవలం 20 నెలల వ్యవధిలోనే గృహ నిర్మాణాలను పూర్తి చేసి లబ్ధిదారుల చేతికి ఇళ్ల తాళాలు



నూతన గృహ ప్రవేశం సందర్భంగా ప్రత్యేక పూజలు చేస్తున్న రాఘవేంద్ర రెడ్డి



నూతన గృహాన్ని ప్రారంభిస్తున్న టీడీపీ ఇన్‌చార్జ్ రాఘవేంద్ర రెడ్డి

అందించడం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పరిపాలన దూరదృష్టి, ప్రజల సంక్షేమంపై ఉన్న నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు. పేద కుటుంబాలకు భద్రతతో పాటు గౌరవప్రదమైన జీవనం కల్పించే ఈ గృహాలు వారి భవిష్యత్తుకు బలమైన పునాదిగా నిలుస్తాయని అన్నారు. ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని ఆయన చెప్పారు. ప్రతి అర్హుడికి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు చేరేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పేదల అభ్యున్నతే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం సంక్షేమాన్ని అభివృద్ధితో కలిపి ముందుకు తీసుకెళ్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ఉపాధ్యక్షులు నల్లమల విజయ్ కుమార్, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి మొట్రు రామాంజనేయులు, యూనిట్ ఇన్‌చార్జి మురళి, మాజీ ఎంపీటీసీ ఈరప్ప నాయుడు, నాయకులు నాగేంద్ర, భీమేష్, శంకర్, కార్యకర్తలు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు. అనంతరం లబ్ధిదారులు ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ తమకు సొంతింటి కల నెరవేరిందని ఆనందం వ్యక్తం చేశారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొనగా, గృహప్రవేశం సందర్భంగా సంప్రదాయ పూజలు నిర్వహించారు.



గ్రామ నాయకులతో మాట్లాడుతున్న రాఘవేంద్ర రెడ్డి. టీడీపీ నాయకులను సన్మానించిన గ్రామ టీడీపీ నాయకులు

## పేదల సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ ధ్యేయం

**మచిలీపట్నం మార్చి 30:**
పేదలందరికీ సొంతింటి కల నెరవేర్చడమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రివర్యులు కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. సోమవారం ఉదయం రాష్ట్ర మంత్రివర్యులు జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు తో కలసి రెండో విడతలో నగరంలోని రుద్రవరంలో 1089 మంది లబ్ధిదారులకు పీఎంఏవై... ఎన్టీఆర్ నగర్ టిడ్కో జి ప్లస్ త్రీ గృహాలను లాంఛనంగా ప్రారంభించి సంబంధిత పత్రాలను, నమూనా తాళం చెవులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు మాట్లాడుతూ నిరుపేదలందరికీ ఇల్లు కట్టించి ఇవ్వాలన్నదే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ధ్యేయమన్నారు. అందులో భాగంగా నేడు రాష్ట్ర ముఖ్యమంత్రి రెండో విడతగా 2,50,893 గృహాలను లాంచనంగా ప్రారంభించి లబ్ధిదారులకు అందజేస్తున్నారన్నారు. ఇది నిజంగా ఒక శుభదినం అని అన్నారు. ఆనాడు కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రివర్యులు వెంకయ్య నాయుడు సహకారంతో రాష్ట్రానికి 2లక్షల 50 వేల ఇల్లు మంజూరయ్యేలా కృషి చేశారన్నారు. మున్సిపల్ శాఖ మంత్రివర్యులు నారాయణ ప్రపంచంలోనే అత్యుత్తమ సాంకేతిక పరిజ్ఞానం షేర్వాల్ సాంకేతికతతో ఇళ్ల నిర్మాణం చేపట్టారన్నారు. అందులో భాగంగా మచిలీపట్నంలోని రుద్రవరంలో 6,400 ఇల్లు మంజూరు చేయించడం జరిగిందన్నారు. అందుకు సంబంధించిన పనులు ప్రారంభించి దాదాపు పూర్తి చేశామన్నారు. ఎన్నికల తర్వాత ఆ పనులు పూర్తిగా ఆగిపోయాయన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్క పేదవారికి ఇల్లు ఇస్తామని హామీ ఇచ్చామన్నారు.

## పీ 4 ప్రాజెక్టులో మార్గదర్శకులుగా తయారు కండి

**పుట్టపర్తి (తెలుగోడు), మార్చి 30:**
పేదల అభ్యున్నతికి ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ 4 ప్రాజెక్టులో పేదలకు సేవలందించి మార్గదర్శకులుగా నిలవాలని పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. పుట్టపర్తి సాయి అరామం లో నిర్వహించిన పి 4 ప్రాజెక్టు ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన ప్రత్యేక సమావేశంలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్వర్ణాంధ్ర 2047 సాధనే ధ్యేయంగా పేదల అభ్యున్నతికి పాటుపడుతున్నారని పేర్కొన్నారు. మహిళా అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేసిందని తెలిపారు. తల్లికి వందనం పథకం ద్వారా 67 లక్షల విద్యార్థుల తల్లి ఖాతాల్లో రూ.9980 కోట్లు జమ చేసినట్లు తెలిపారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు దివ్యాంగులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. అదేవిధంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ నిర్వహించి సుమారు 16 వేల పైగా పోస్టులు భర్తీ చేసినట్లు తెలిపారు. అంతే కాకుండా మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ ఏర్పాటు చేసి విద్యాభివృద్ధికి మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చొరవ తీసుకున్నారని తెలిపారు. పి 4 కార్యక్రమం కింద పుట్టపర్తి నియోజకవర్గం లో 7890 పేద కుటుంబాలు ఉంటే 3723 బంగారు కుటుంబాలను 783 మంది మార్గదర్శకులు వీరిని దత్తతకు తీసుకున్నట్లు తెలిపారు. అంతేకాకుండా పల్లె ఉమా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ ఏడాది సుమారు 600 మంది పేద విద్యార్థులకు ఉచిత ఎంసెట్ కోచింగ్ ఇస్తున్నట్లు తెలిపారు. ఇలా 2019 నుంచి ఇప్పటివరకు సుమారు 5వేల మంది విద్యార్థులకు ఉచితంగా విజయవాడ చెందిన సీనియర్ ఆధ్యాపకులతో కోచింగ్ ఇచ్చినట్లు వెల్లడించారు. అంతేకాకుండా మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ప్రతినెల 25 మంది పేదలకు పెన్షన్ రూపంకంగా ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో ఏ కష్టం వచ్చినా పేద ప్రజలకు ఆర్థిక సహాయం అందించి అండగాలి నిలుస్తున్న మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డికి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి తో పాటు జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ ప్రత్యేకంగా అభినందించి కృతజ్ఞతలు తెలిపారు. మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ, తాను సామాన్య కుటుంబంలో జన్మించి విద్యను అభ్యసించడం వల్ల తను ఉన్న స్థాయికి చేరుకొని నిత్యం ప్రజా సేవలో పాలుపంచుకుంటున్నారని తెలిపారు. సేవా మార్గం తోని మనిషికి సంతృప్తి లభిస్తుందని పేర్కొన్నారు. నియోజకవర్గంలో ఎక్కడ ఇల్లు కాలిపోయినా, ఎవరి చనిపోయినా తాను అండగా ఉండి వారికి ఎంతో కొంత ఆర్థిక సహాయం అందించే గుణం దేవుడిచ్చారని తెలిపారు. అలా దానం చేయని రోజు రాత్రి నిద్ర పట్టదని తెలిపారు. అలాగే మీరు కూడా ఎంతో కొంత పేదలకు సాయం చేసే మార్గాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం పేదలను ఆదుకోవాలని ఉద్దేశంతో చేపట్టిన పీ 4 ప్రాజెక్టులో భాగస్వాములైన సామకోటి ఆదినారాయణ కాంట్రాక్టర్ లక్ష్మీనారాయణ శ్రీరామ్ రెడ్డి లక్ష్మీనారాయణ నటరాజ్ ఆర్ డి టి డైరెక్టర్ రఘురాం ఓడిసి మండలం జనార్దన్ రెడ్డిని ఎమ్మెల్యే పల్లె సింధూర మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం పి 4 ప్రాజెక్టులో భాగస్వాములై దత్తత తీసుకున్న మార్గదర్శకులను ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ,జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ఆర్డీవో సువర్ణ సి పి ఓ అశోక్ కుమార్ జడ్పీ సీఈవో వెంకటసుబ్బయ్య పి4 అధికారి స్వాతి తదితరులు శాలువాలు కప్పి ప్రశంస పత్రాన్ని అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన ప్రజాప్రతినిధులు ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# స్వర్ణాంధ్ర 2047 లక్ష్యంగా 'మార్గదర్శి బంగారు కుటుంబాలు' కార్యక్రమం

### మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జ్ ఎన్. రాఘవేంద్ర రెడ్డి..

**పెద్దకడబూరు (తెలుగోడు), మార్చి 30:**
మంత్రాలయంలోని మండల పరిషత్ కార్యాలయంలో "మార్గదర్శి బంగారు కుటుంబాలు 10 - 20, - స్వర్ణాంధ్ర 2047" కార్యక్రమం ఒక సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జ్ ఎన్. రాఘవేంద్ర రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీరో పావర్టీ పీ4 ప్రోగ్రాం వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని స్వర్ణాంధ్ర 2047 విజన్‌ను డిజిటల్ ప్రదర్శన ద్వారా వివరించారు. గత ఏడాది కాలంలో పేద కుటుంబాల అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు, లబ్ధిదారులకు అందిన ప్రయోజనాలను అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో యువనేత ఎన్. రాకేష్ రెడ్డి, కౌతళం సొసైటీ చైర్మన్ వెంకటపతి రాజు అందుకున్న అవార్డులు నియోజకవర్గానికి గర్వకారణమని రాఘవేంద్ర రెడ్డి పేర్కొన్నారు. సమాజ అభివృద్ధికి కృషి చేస్తున్న వారిని సత్కరించడం సేవాభావానికి ఇచ్చే గౌరవమని ఆయన తెలిపారు. పేదరిక నిర్మూలన లక్ష్యంగా రూపొందించిన పీ4 కార్యక్రమం సాధారణ పథకం కాదని, సమాజంలో ఆర్థిక అసమానతలను తగ్గించి ప్రతి కుటుంబాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లే మహత్తర కార్యక్రమమని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టితో స్వర్ణాంధ్ర 2047 లక్ష్యంగా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ పేద కుటుంబాలను స్వయం సమృద్ధి వైపు తీసుకెళ్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం, పరిశ్రమలు, సమాజం కలిసి పనిచేస్తేనే పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించవచ్చని, సంస్థలు తమ సీఎస్ఆర్ కార్యక్రమాల ద్వారా ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. మార్గదర్శి బంగారు కుటుంబాల కార్యక్రమం ద్వారా కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపడటంతోపాటు భవిష్యత్తుపై నమ్మకం పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ డీపీవో భాస్కర్, తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ నూర్జాహాన్, పెద్దకడబూరు ఎంపీడీవో ప్రభావతి దేవి, విజనరీ ప్లానింగ్ ఆఫీసర్ రాజు, కూటమి నాయకులు, కార్యకర్తలు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న పెద్దకడబూరు ఎంపీడీవో ప్రభావతి దేవి



ప్రశంసా పత్రం అందజేస్తున్న టీడీపీ ఇన్ చార్జ్ రాఘవేంద్ర రెడ్డి



అధికారులతో కలిసి కేక్ కట్ చేస్తున్న టీడీపీ ఇన్ చార్జ్ రాఘవేంద్ర రెడ్డి. టీడీపీ ఇన్ చార్జ్ రాఘవేంద్ర రెడ్డికి కేక్ తినిపిస్తున్న స్పెషల్ ఆఫీసర్ రాజు

# పంటలతో పాటు పశుసంపద పెంపకంతో రైతులకు అదనపు ఆదాయం

### మార్కెట్ యార్డు ఉపాధ్యక్షులు బొగ్గుల తిక్కన్న ..

**పెద్దకడబూరు (తెలుగోడు), మార్చి 30:**
రైతులు పంటల సాగుతో పాటు పశుసంపద పెంపకంపై దృష్టి సారిస్తే అదనపు ఆదాయం పొందే అవకాశం ఉంటుందని మంత్రాలయం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బొగ్గుల తిక్కన్న కార్తికేయ పేర్కొన్నారు. సోమవారం మంత్రాలయం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆర్థిక సహకారంతో పెద్దకడబూరు మండల పరిధిలోని కల్లుకుంట గ్రామంలో నిర్వహించిన ఉచిత పశు వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ శిబిరాన్ని పశు వైద్య అధికారి డాక్టర్ దినాకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తిక్కన్న కార్తికేయ మాట్లాడుతూ రైతుల ఆర్థిక స్థితి బలోపేతానికి పంటలతో పాటు పశుసంపద కూడా కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. రైతుల అభివృద్ధి, పశుసంపద పరిరక్షణ కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. గత ప్రభుత్వ కాలంలో పశుసంపద రంగం నిర్లక్ష్యానికి గురైందని, ప్రస్తుతం ప్రభుత్వం రైతన్న సంక్షేమం కోసం అనేక చర్యలు చేపడుతోందన్నారు.
రైతులకు సబ్సిడీ ఎరువులు, వ్యవసాయ రుణాలు, అన్నదాత సుఖీభవ వంటి పథకాల ద్వారా ఆర్థిక సహాయం అందించడమే కాకుండా, సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు కూడా అందజేస్తున్నట్లు తెలిపారు. పశుసంపద అభివృద్ధి కోసం రాష్ట్ర బడ్జెట్‌లో కూడా ప్రభుత్వం గణనీయమైన నిధులు కేటాయించిందని పేర్కొన్నారు. పశువుల ఆరోగ్య సంరక్షణ కోసం గ్రామీణ ప్రాంతాల్లో తరచుగా వైద్య శిబిరాలు నిర్వహించడం ద్వారా పశువులకు వ్యాధుల నివారణ చికిత్సలు అందిస్తున్నామని తెలిపారు. ఈ శిబిరంలో కల్లుకుంట గ్రామానికి చెందిన పశువులు, గొర్రెలు, మేకలు, బర్రెలకు గర్భకోశ సంబంధిత వ్యాధులు, నట్టాల నివారణ మందులు, గాలికుంట టీకాలు, ఇతర వ్యాధి నిరోధక మందులు పంపిణీ చేశారు. అలాగే పశువుల సంరక్షణపై రైతులకు వైద్యులు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ కార్యదర్శి రాఘవేంద్ర, పశువైద్య సిబ్బంది, రైతులు, పశుయాజమానులు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మార్కెట్ యార్డ్ ఉపాధ్యక్షులు బొగ్గుల తిక్కన్న



పశు యజమానులకు మందులు పంపిణీ చేస్తున్న మార్కెట్ యార్డ్ ఉపాధ్యక్షులు బొగ్గుల తిక్కన్న



పశువులకు, గొర్రెలకు టీకాలు వేస్తున్న దృశ్యం

# బలహీన కుటుంబాలను బంగారు కుటుంబాలుగా మార్చడమే పి-4 ముఖ్య ఉద్దేశ్యం

## 2047 కల్లా స్వర్ణాంధ్ర ఏర్పాటు లక్ష్యంగా ముఖ్యమంత్రి అడుగులు జిల్లా అధ్యక్షులు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు.. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ..

రొళ్ల (తెలుగోడు), మార్చి 30:
బలహీన కుటుంబాలను బంగారు కుటుంబాలుగా మార్చడమే పి-4 ముఖ్య ఉద్దేశ్యం అని జిల్లా అధ్యక్షులు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి అన్నారు. మడకశిర పట్టణంలో స్వర్ణాంధ్ర ప్రభుత్వ ప్రైవేటు ప్రజల భాగస్వామ్యం పి-4 కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి మడకశిర నియోజకవర్గం స్పెషల్ ఆఫీసర్ శ్రీకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2029 నాటికి మార్గదర్శకులు బంగారు కుటుంబాలు అన్నింటిని పేదరికం నుండి నిర్మాణాత్మకమైన విస్తరింప చేయదగు నమూనా ద్వారా అభివృద్ధి చెందే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శ్రీకారం చుట్టారన్నారు.
ఆర్థిక అభివృద్ధి బాగమవుతున్న లేదా దోహదపడుతున్న అభివృద్ధి చెందిన కుటుంబాలు సమాజానికి తిరిగి మద్దతు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్న మార్గదర్శకులు పురోగతి కోసం మార్గదర్శకత్వం కోరుకుంటున్న వెలికి తీయని సామర్థ్యం గల బలహీన కుటుంబాలు మార్గదర్శకత్వం మరియు మద్దతు అవసరమున్న బంగారు కుటుంబాలను గుర్తించి స్వర్ణాంధ్ర 2047 క్రింద రాష్ట్రాన్ని అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థగా మార్చాలని ప్రభుత్వం లక్ష్యంగా 10 మార్గదర్శక సూత్రాలు పెట్టుకొందన్నారు. వాటిలో ప్రధానమైంది ఐదేళ్లలో పేదరికం నిర్మూలించడం బలహీన కుటుంబాల కోసం బలమైన సంక్షేమ వ్యవస్థ ద్వారా మద్దతు ఇవ్వడం, రాష్ట్రం వెనుకబడిన వర్గాల వారికి సంపన్నులో సాధికారతను కల్పించే పర్యావరణ వ్యవస్థను ప్రోత్సహిస్తోందన్నారు. గత కొన్ని దశాబ్దాలుగా స్థిరమైన డీజీపీ వృద్ధి ప్రైవేట్ సంపదను సృష్టించి స్థిరమైన సమాజ మద్దతుతో విజయం సాధించిన సంపన్నులు సమాజానికి తిరిగి ఇవ్వడానికి ఆసక్తిగా ఉన్నారన్నారు. జీరో పావర్టీ పి-4 విధానం పేదరికపు విష వలయాన్ని విచ్ఛిన్నం చేయడానికి నిరుపేదలకు సాధికారత కల్పించే దిశగా ప్రైవేటు వనరులను నిర్దేశించి స్వీయ నిరంతర పర్యావరణ వ్యవస్థను నిర్మించడం ద్వారా తిరిగి స్ఫూర్తిని కొనసాగుతోందన్నారు. జీరో పావర్టి పి-4 విధానం సంపన్నులను మార్గదర్శి వెనుకబడిన వారిని బంగారు కుటుంబాన్ని ఒకచోట చేర్చి ఇద్దరి అవసరాలకు అనుగుణంగా మద్దతు నిలుస్తుందన్నారు. సంపన్న వ్యక్తులు కార్పొరేట్ వ్యవస్థ వారికి ఉత్తమంగా సరిపోయే పద్ధతుల్లో ఇవ్వగలదాన్ని నిర్ధారిస్తూ అందుబాటులో ఉన్న అనుకూలమైన సహకారాలను సులభతరం చేస్తుందన్నారు. ఇందులో భాగంగా చిన్న వ్యాపారుల ఇంక్యుబేషన్ విద్యార్థులకు కౌన్సిలింగ్ ప్రొఫెషనల్ నెట్వర్క్‌లకు అనుసంధానం చేయడం, సాంకేతిక అక్షరాస్యత కేంద్రాన్ని ఏర్పాటు చేయడం, సూక్ష్మ సాగు నీటిపారుదలను అందించడం, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు విద్యార్థులకు స్కాలర్షిప్ కల్పించడం, వైద్య చికిత్సకు నిధులు సమకూర్చడం, అనాధ ఆశ్రమాలు అభ్యాస సాధనాలు సమకూర్చడం, గ్రామ మండలాన్ని దత్తత తీసుకోవడం, సామాజిక అభివృద్ధి కార్యక్రమాలకు ఆర్థిక సహాయం అందించడం, కుటుంబాలను దత్తత తీసుకోవడం, పేదరికం నుండి వారిని ఉద్ధరించడానికి ఒక కుటుంబాన్ని ఆదుకోవడం వంటి కార్యక్రమంలో భాగంగా మార్గదర్శకాలు సహకారాలు పూర్తిగా స్వచ్ఛందంగా ఇందులో ఉంటాయన్నారు. మడకశిర నియోజకవర్గంలో బంగారు కుటుంబాలుగా 4108, మార్గదర్శకులు 932 ఉన్నారన్నారు. స్వర్ణాంధ్రలో భాగంగా మార్గదర్శకులు బంగారు కుటుంబాలకు విద్య, వైద్య, పరిశ్రమలో, వాణిజ్య, వ్యవసాయ రంగాలలో బంగారు కుటుంబాలకు బాసటగా నిలవాలన్నారు. ఇందులో భాగంగా మడకశిర నియోజకవర్గం వ్యాప్తంగా బంగారు కుటుంబాలకు బాసటగా నిలిచిన మార్గదర్శకులుగా మడకశిర పట్టణం కెనరా బ్యాంక్, కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ నరసింహమూర్తికి ప్రశంసా పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కుంచిటి గ ఒక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ, మున్సిపల్ కమిషనర్, కన్వీనర్లు, సింగల్ విండో అధ్యక్షులు, అన్ని మండలాల తహసీల్దార్ లు ఎంపీడీఓ లు ప్రభుత్వ అధికారులు బంగారు కుటుంబాలు నాయకులు కార్యకర్తలు కూటమి నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు


ప్రశంస పత్రాన్ని అందిస్తున్న దృశ్యం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి. హాజరైన అధికారులు


బాధ్యతలు స్వీకరిస్తున్న డాక్టర్ డి. శ్రీనివాసమూర్తి

# బాధ్యతలు చేపట్టిన రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు డాక్టర్ డి. శ్రీనివాసమూర్తి

రొళ్ల (తెలుగోడు), మార్చి 30:
రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ నూతన చైర్ పర్సన్‌గా వేటుకూరి ఏవిఎస్ సూర్యనారాయణ రాజు, సభ్యులుగా కే.జీ వెంకట పద్మలత, డా. ధోని శ్రీనివాసమూర్తి, ఉండవల్లి గాంధీ బాబు, చల్ల మధుసూదన రావు, మండల గంగ సూర్యనారాయణ, పి.నాగ మానస సోమవారం రాష్ట్ర కార్యాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సెక్రటరీ ఉమాదేవి సమక్షంలో నూతన చైర్ పర్సన్, సభ్యులు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సెక్రటరీ, సిబ్బంది నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.
ఈ సందర్భంగా డాక్టర్ డి.శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ బాలల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసేలా పనిచేస్తామని తెలిపారు. సభ్యులు సమన్వయంతో బాలల హక్కుల పరిరక్షణలో రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేస్తామన్నారు. రాష్ట్రస్థాయి, జిల్లాస్థాయి అధికారుల సమన్వయంతో చైల్డ్ ఫ్రెండ్లీ స్టేట్‌గా ఆంధ్రప్రదేశ్‌ని నిలుపుతామన్నారు. బాలల హక్కులకు భంగం వాటిల్లితే తక్షణమే కమిషన్ దృష్టికి తీసుకు రావాలని ప్రజలను కోరారు.


చైర్మన్‌ను సన్మానిస్తున్న సభ్యులు డాక్టర్ డి. శ్రీనివాసమూర్తి



పోలీసులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

# ప్రజల్లో చైతన్యానికి పోలీసుల ఫ్లెక్సీలు

అమరాపురం (తెలుగోడు), మార్చి 30:
వలస గ్రామంలో వెలసిన శ్రీ మారమ్మ దేవి జాతర ఉత్సవాల సందర్భంగా భక్తాదులు, ప్రజలు చైతన్యం కావాల నే ఉద్దేశంతో పెనుగొండ సబ్ డివిజన్ పోలీస్ ఆఫీసర్ సూచనల మేరకు, మడకశిర రూరల్ సి.ఐ ఆదేశాల మేరకు అమరాపురం పోలీసు స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ వలి బాష , ఏ. ఎస్ .ఐ రామాంజనేయులు సిబ్బంది అనేక చోట ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. బాల్యాన్ని రక్షించండి, మైనర్ బాలిక అనుమతి చట్టపరంగా చెల్లదు, గొడవలు జీవితాన్ని నాశనం చేస్తాయి, గొడవలు లేకుంటే కుటుంబంలో సంతోషం తదితర చైతన్య ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు.


బ్యూటీ పార్లర్లను సందర్శించిన ఉపాధ్యాయులు విద్యార్థులు

# వృత్తి విద్యా కోర్సులతో విద్యార్థులకు ఉపాధి అవకాశాలు

### ఆదర్శపాఠశాల ప్రిన్సిపాల్ సి హెచ్. విజయకుమారి..

అగళి (తెలుగోడు), మార్చి 30:
వృత్తి విద్యా కోర్సులతో విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కలుగుతాయని ఆదర్శపాఠశాల ప్రిన్సిపాల్ సి హెచ్. విజయకుమారి అన్నారు. అగళి ఆదర్శ పాఠశాలలో చదువుతున్న ఒకేషనల్ విద్యార్థులు బ్యూటీ అండ్ వెల్నెస్, ఐటి ట్రేడ్‌లో భాగంగా 10 రోజుల పాటు ఇంటర్ షిప్ కార్యక్రమం నిర్వహించారు.. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు బ్యూటీ పార్లర్ సంబంధించిన ప్రత్యక్ష అవగాహన నైపుణ్యం పొందిన వారిచే శిక్షణ అందించారు. అలాగే ఐటి ట్రేడ్ గురించి పలు ఇంటర్నెట్ సెంటర్లు, ప్రింటింగ్ ప్రెస్, మొబైల్ హార్డ్వేర్ తదితర వాటిపై సందర్శింపచేసి విద్యార్థులకు అవగాహన కల్పించారు. నైపుణ్యం పొందుతున్న విద్యార్థులతో పాటు శ్రీ సత్యసాయి జిల్లా డిస్ట్రిక్ట్ ఒకేషనల్ కోఆర్డినేటర్ నరసింహమూర్తి, నరేంద్ర సందర్శించారు.విద్యార్థుల తో చర్చించి,వారు నేర్చుకున్న సెంటర్లలో చేసే పనులపై సమగ్ర అవగాహన పొందారు.ఈ కార్యక్రమం ఒకేషనల్ ట్రైనర్ ఆర్.నాగరత్నమ్మ, చంద్రబాబునాయుడు పర్యవేక్షణలో జరిగింది. విద్యార్థులు తమ ప్రాక్టికల్ అనుభవాలను పంచుకున్నారు.ఈ అవకాశాన్ని కల్పించిన ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ సి హెచ్ విజయకుమారి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.


మాట్లాడుతున్న పూర్వ విద్యార్థులు ఆర్గనైజింగ్ కార్యదర్శి సూగూరు తిప్పేస్వామి , , బాలకృష్ణ, జనరల్ సెక్రెటరీ పి.ఎస్. మంజునాథ్. పూర్వ విద్యార్థి మాజీ సర్పంచ్, మాజీ కన్వీనర్ శివ రుద్రప్పకు సన్మానం చేస్తున్న దృశ్యం.

# ఘనంగా పూర్వ విద్యార్థుల సమావేశం

అమరాపురం (తెలుగోడు), మార్చి 30 :
వలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం పూర్వ విద్యార్థుల సమావేశాన్ని ఆర్గనైజింగ్ కార్యదర్శి డాక్టర్ సూగూరు తిప్పేస్వామి, రిటైర్డ్ తెలుగు పండితులుఅధ్యక్షులు నరసింహమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు.. ఈ సందర్భంగా ఆర్గనైజింగ్ కార్యదర్శి డాక్టర్ సూగూరు తిప్పేస్వామి, రిటైర్డ్ తెలుగు పండితులు అధ్యక్షులు నరసింహమూర్తి, డాక్టర్ సీతారాం, ప్రొఫెసర్ రంగస్వామి , ఎంఈఓ గంగప్ప,, డాక్టర్ బాలకృష్ణ డాక్టర్ చంద్రశేఖర్, పి.ఎస్. మంజునాథ్, మాధవ రెడ్డి తదితరులు మాట్లాడుతూ తాము గత 30 సంవత్సరాల నుంచి వివిధ ప్రాంతాలలో స్థిరపడ్డామన్నారు. అయితే పాఠశాల అభివృద్ధి గ్రామ అభివృద్ధికి తమ వంతు బాధ్యతగా పనిచేస్తామని తెలిపారు. మానసికంగా, దైహికంగా, పాఠశాల అభివృద్ధి, గుడి అభివృద్ధికి సహాయం చేస్తామని, కష్టాల్లో ఉన్న రైతులను ఆదుకుంటామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మండల మాజీ కన్వీనర్ శివ రుద్రప్ప, సర్పంచ్ జితేంద్ర, మాజీ సర్పంచ్ చంద్రశేఖర్ గౌడ్, నిరంజన్, బి.ఎస్. నాగరాజు, నాగేంద్రప్ప, దివాకర్ రెడ్డి, భీమేష్ , తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున పూర్వ విద్యార్థి డాక్టర్ నరసింహమూర్తి


మాట్లాడుతున్న పూర్వ విద్యార్థి ఎంఈఓ గంగప్ప హాజరైన పూర్వ విద్యార్థులు


ఆశ్రమంలో అన్నదానం చేస్తున్న దృశ్యం

# మానసిక వికలాంగులకు అన్నదానం

ముద్దనూరు (తెలుగోడు), మార్చి 30 :
స్థానిక ఎస్విగిరి కాలనీకి చెందిన మిద్దె పాములేటి తన మాతృమూర్తి మిద్దె ఓబులమ్మ జ్ఞాపకార్థం సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తన మాతృమూర్తి ఏడవ వర్ధంతి సందర్భంగా మంగపట్నం సమీపంలో ఉన్న యేసు శరణాలయంలో నివసిస్తున్న దాదాపు 70 మంది మానసిక వికలాంగులకు చికెన్ బిర్యానీతో మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేశారు. ఆశ్రమాన్ని నిర్వహిస్తున్న నిర్వాహకులతో పాటు, అక్కడ ఆశ్రమం పొందుతున్న మానసిక వికలాంగులు వారిని మనస్ఫూర్తిగా ఆశీర్వదిస్తూ, సంతృప్తి వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా పాములేటి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇలాంటి వారికి చేయూతనిస్తూ తమ వంతు సహాయంగా ఏదో ఒక రూపకంగా సహాయం చేయాలని ఆయన కోరారు.


అన్నదానం చేస్తున్న దృశ్యం

# గూడూరులో ప్రాణాంతకంగా మారిన గుంత!

గూడూరు (తెలుగోడు), మార్చి 30:
నెల్లూరు జిల్లా గూడూరు రెండో పట్నం గాంధీనగర్ 2వ వార్డు పరిధిలోని నాయి బ్రాహ్మణ కాలనీలో ప్రభుత్వానికి చెందిన ఖాళీ స్థలంలో గతంలో తవ్విన ఒక గుంత ప్రస్తుతం ప్రాణాంతకంగా మారి స్థానిక ప్రజలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. సుమారు 15 సంవత్సరాల క్రితం కావలి హరిబాబు తండ్రి ఆదిశేషయ్య లెట్రిన్ నిర్మాణం కోసం ఈ గుంతను తవ్వించినట్లు కాలనీవాసులు తెలిపారు. అయితే ఆ స్థలానికి సంబంధించి ఇంటి పట్టాలు లేకపోవడంతో నిర్మాణ పనులు మధ్యలోనే ఆగిపోయాయి. ఫలితంగా గుంత అలాగే ప్రమాదకరంగా మిగిలిపోయింది.కాలక్రమేణా ఈ గుంతలో చెత్త, మురుగు నీరు చేరి మరింత ప్రమాదకరంగా మారింది. ఇప్పటికే ఈ గుంతలో వీధి కుక్కలు, పందులు పడిపోయి మృతి చెందిన ఘటనలు చోటుచేసుకున్నాయని స్థానికులు చెబుతున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు ఆడుకునే ప్రాంతం కావడంతో ఎప్పుడైనా ప్రమాదం సంభవించే అవకాశం ఉందని వారు తీవ్రంగా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో ఈ గుంత కనిపించకపోవడం వల్ల ప్రమాదం మరింత ఎక్కువగా ఉందని తెలిపారు.ఈ సమస్యపై పలుమార్లు కావలి హరిబాబు తండ్రి ఆదిశేషయ్యను గుంతను పూడ్చివేయాలని కోరినప్పటికీ, ఆయన స్పందించకపోవడంతో పాటు ప్రశ్నించిన వారిని అసభ్య పదజాలంతో దూషిస్తూ, బెదిరింపులకు పాల్పడుతున్నారని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. గత మూడు రోజుల క్రితం ఆవు ఈ గుంటలో పడి ప్రమాది స్థితిలో ఉన్నది అంతేకాకుండా అధికారులకు ఫిర్యాదు చేసిన వారిపైనా దౌర్జన్యంగా ప్రవర్తిస్తున్నాడని తెలిపారు. దీంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు.ఇది ప్రభుత్వ భూమి కావడంతో, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఈ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని, గుంతను తక్షణం పూడ్చివేసి ప్రజలకు రక్షణ కల్పించాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు. మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్ తక్షణమే చర్యలు తీసుకోకపోతే పెద్ద ప్రమాదం సంభవించే అవకాశముందని హెచ్చరిస్తున్నారు.ప్రజల ప్రాణాలు పోయిన తరువాత స్పందించడం కంటే ముందస్తు చర్యలు తీసుకోవాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు. ప్రస్తుతం ఈ గుంత గూడూరు పట్టణంలో అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోంది.


గుంతలో పడిపోయిన మూగ జీవి

# గుంతలో పడి గుర్తుతెలియని వ్యక్తికి తీవ్ర గాయాలు

ముద్దనూరు (తెలుగోడు), మార్చి 30 :
స్థానిక ముద్దనూరు పులివెందుల జాతీయ రహదారిలో ఉన్న కంకర మిషన్ సమీపంలో కల్వర్టు పనుల జరుగుతున్న భారీ గుంతలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి ఓ పల్సర్ బైకుతో సహాపడి తీవ్ర గాయాలయ్యాయి. ముద్దనూరు వైపు నుండి వెళ్తే అతను మొదటి కల్వర్టు పిల్లర్ దగ్గరనే పడి ఉన్నట్లు గమనించిన స్థానికులు ఎంటనే 108 సమాచారం అందించారు. వెంటనే అతన్ని ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. అతని పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.





గాయపడిన వ్యక్తిని ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం



క్రికెట్ ఫైనల్స్ మ్యాచ్ విజేతలకు బహుమతులు పంపిణీ చేస్తున్న గుమ్మనూరు ఈశ్వర్

# ముగిసిన గుత్తి మండల క్రికెట్ అసోసియేషన్ టోర్నీ

### ఫైనల్ మ్యాచ్‌కు హాజరైన గుమ్మనూరు ఈశ్వర్..

**గుత్తి (తెలుగోడు), మార్చి 30:**
స్థానిక రైల్వే ఇన్స్టిట్యూట్ గ్రౌండ్‌లో గత నాలుగు రోజులుగా జరుగుతున్న గుత్తి మండల క్రికెట్ అసోసియేషన్ టోర్నమెంట్ సోమవారం ముగిసింది. గుత్తి ఆర్ఎస్ గుత్తి మండలం క్రికెట్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన క్రికెట్ మ్యాచ్ కు ముఖ్యఅతిథిగా శాసనసభ్యులు గుమ్మనూరు జయరాం తనయుడు గుత్తి , పామిడి ఇంచార్జ్ గుమ్మనూరు ఈశ్వర్‌కు క్రికెట్ అసోసియేషన్ వారు ఘనస్వాగతం పలికారు. అనంతరం యువనేత గుమ్మనూరు ఈశ్వర్ మాట్లాడుతూ క్రీడలలో ఓటములు ,గెలుపులు సమానం, గెలిచిన వారు ఎక్కువగా ఓడిన వారు తక్కువ అందరూ సమానులే గుంతకల్లు నియోజకవర్గంలో కూడా క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభిస్తామన్నారు. క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్‌కు తనను పిలవడం చాలా సంతోషకరంగా ఉందన్నారు. క్రీడాకారులు బాగా ఆడి ఉన్నత స్థాయికి ఎదగాలని కూడా కోరుకుంటున్నాను అని ఆయన పేర్కొన్నారు. మొదటి బహుమతి 30000 రూపాయలు స్పాన్సర్ చేసిన వారు గుత్తి ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు యర్రగుడి రమేష్ గుత్తి ఆర్ఎస్ యువ నాయకులు రాజా, విన్నర్స్ నిలిచిన గుత్తి ఆర్ఎస్ టీమ్ కు 30000 వేల రూపాయలు గుమ్మనూరు ఈశ్వర్ చేతుల మీదుగా అందించారు.రన్నర్స్ టీం గుంతకల్లు టీం కు 20000 రూపాయలను అనంతపురం జిల్లా క్రికెట్ అసోసియేషన్ సభ్యుల చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో గుత్తి పట్టణం మరియు మండల కూటమి నాయకులు కార్యకర్తలు అనుబంధ కమిటీ సభ్యులు క్రీడా అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు పంపిణీ చేస్తున్న గుమ్మనూరు ఈశ్వర్

# పీ-4 కార్యక్రమం దేశానికే ఆదర్శం

### ఎమ్మెల్యే దగ్గుపాటి ..

**అనంతపురం రూరల్ (తెలుగోడు), మార్చి 30 :**
ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దూర దృష్టితో చేపట్టిన పీ-4 కార్యక్రమం నేడు దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా మారిందని అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. పీ-4 కార్యక్రమానికి సంవత్సరం పూర్తైన సందర్భంగా స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బంగారు కుటుంబాలు, మార్గదర్శులతో ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ ఇరువురితోనూ పరస్పర సంభాషణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం మార్గదర్శి కుటుంబాలను ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఘనంగా సత్కరించారు. వారిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలామంది పేదరికంతో ఇబ్బంది పడుతున్నారని.. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడి ఉన్నారన్నారు. ఇలాంటి వారిని అందరితోపాటు ముందుకు నడిపించే విధంగా దత్తతు తీసుకునేలా పీ-4 కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు అలాగే ఉద్యోగులు ఇలా అందర్నీ ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం చేస్తూ సేవా కార్యక్రమాల వైపు నడిపించారన్నారు. ఈ విధంగా ఏడాది క్రితం ప్రారంభమైన ఈ కార్యక్రమం ద్వారా ఎంతో మందికి లబ్ధి చేకూరుతోందన్నారు. తన కూతురు దగ్గుపాటి అశ్రిత కూడా 25 కుటుంబాలను దత్తత తీసుకున్నారన్నారు. అలాగే అనంతపురం నగరంలో ఎస్ఈ రాజశేఖర్ 150 కుటుంబాలను, టీడీపీ నేత ఓంకార్ రెడ్డి పీ4 కింద 99కుటుంబాలను దత్తతు తీసుకున్నారన్నారు.

# విబిజీ-రామ్-జి చట్టాన్ని రద్దుచేయాలి

### సిపిఐ మండల కార్యదర్శి వెంకటరాముడు యాదవ్..

**యాడికి (తెలుగోడు), మార్చి 30:**
పెద్దవడూరు మండల కేంద్రంలో సిపిఐ ఆధ్వర్యంలో సోమవారం విబిజీ-రామ్-జి చట్టాన్ని రద్దుచేసి మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం చట్టాన్ని కొనసాగించాలని గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. అనంతరం అనంతరం ఎమ్మార్వోకి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సిపిఐ సీనియర్ నాయకులు వై సూర్యనారాయణ రెడ్డి, వెంకట్రాముడు యాదవ్ మాట్లాడుతూ గ్రామీణ కష్టజీవుల జీవనముకు ఎంతో ఉపయోగపడే మహాత్మా జాతీయ గ్రామీణ ఉపాధి హామీగ్యారంటీ పథకాన్ని నీరుగార్చాలని ఉద్దేశంతో మోడీ ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వంపై అదనపు భారాలు వేసి విధంగా ఈ పథకాన్ని రూపొందించారన్నారు. దీని పూర్తిగా వ్యతిరేకిస్తున్నాం ఎందుకనగా గతంలో కేంద్ర ప్రభుత్వం 90 శాతం నిధులు ఇస్తే ఈ కొత్త పథకంలో 60 శాతం మాత్రమే ఇచ్చిందన్నారు. ఇప్పటికే అప్పుల ఊబిలో



పెద్దవడుగూరు తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న సిపిఐ నాయకులు



పెద్దవడుగూరులోని గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న సిపిఐ నాయకులు

కూరుకుపోయిన ప్రభుత్వం 40% నిధులు వెచ్చించాలని ఈ చట్టం రూపకల్పన చేశారన్నారు. దానివల్ల ఉపాధి పథకం అనేది పేదలకు కేంద్ర విధానాల వల్ల భారీ నష్టం కలుగుతుందన్నారు. గతంలో కూలీలకు గడార్లు, గంపలు, పారలు, తార్పాలిన్లు మెడికల్ కిట్లు, అందించేవారు ఈ మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అవన్నీ అటకెక్కాయన్నారు. ప్రభుత్వం ఈ పథకాన్ని తీసేయాలని కంకణం కట్టుకొని ప్రతి సంవత్సరం కేంద్ర బడ్జెట్లో నిధులు తగ్గించుకుంటూ పేదల నోట్లో మట్టికొడుతోందన్నారు. దీని వలన పేదల పైన క్రూరదాడి చేయడమే మోడీ ప్రభుత్వ ఎజెండాలా కనిపిస్తోందన్నారు. ఇప్పటికైనా కనువిప్పు కలిగి గతంలో వచ్చే నిధులు శాతాన్ని తగ్గించకుండా యధావిదంగా కొనసాగించాలన్నారు. 200 రోజులు పని దినాలను పెంచాలి, కూలి 700 రూపాయలు ఇవ్వాలని, పని ప్రదేశాల్లో చనిపోయిన వ్యక్తి కుటుంబానికి పది లక్షల ఎక్స్ గ్రేషియాఇవ్వాలని, చేనేత కార్మికులకు కూటమీ ప్రభుత్వం ఇస్తామన్న సంవత్సరానికి 36,000 చేనేత నేస్తం తక్షణమే ఇవ్వాలని, రైతులు పంటలు గిట్టుబాటు లేక రైతన్నలు తీవ్ర నష్టాలు అప్పుల పాలవుతున్నారని, తక్షణమే రైతులకు మద్దతు ధరలు ఇచ్చి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు నారాయణ సిపిఐ నాయకులు రంగస్వామి, రంగనాయకులు, అల్లాబకాష్, హుస్సేన్ పీరా,ఓం నారాయణ, కిరణ్ ,నాగేంద్ర,డి రామాంజనేయులు, చారు గుండ్ల వెంకట రాముడు ,ఆది రంగారెడ్డి, పరమేశు, సుంకన్న, రంగడు, సంజన తదితరులు పాల్గొన్నారు.

# అనంతపురం పోలీస్ హాకాథాన్‌లో గేట్స్ విద్యార్థుల ప్రతిభ

**గుత్తి (తెలుగోడు), మార్చి 30:**
పట్టడానికి చెందిన గెట్స్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు అనంతపురంలో జరిగిన కార్యక్రమంలో తమ ప్రతిభను చాటి గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల కీర్తి ప్రతిష్టలను మరింత పెంచారు. పోలీసింగ్ లో ఎదురవుతున్న సరికొత్త సవాళ్లను ఎదుర్కొనడానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా పరిష్కారాలు కనుగొనేందుకు అనంతపురం పోలీస్ శాఖ వారు నిర్వహించిన 24 గంటల ఏ ఐ పోలీస్ హాకాథాన్ లో వివిధ రాష్ట్రాల నుండి విద్యార్థులు మరియు నిపుణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు .ఇందులో గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు సాయి రేవంత్ సందీప్, రాకేష్ లు తమ ప్రతిభను చూపించి మొదటి బహుమతిని కైవసం చేసుకున్నారు, మొదటి బహుమతి కైవసం చేసుకున్న గ్రేట్ విద్యార్థులకు అనంతపురం జిల్లా ఎస్పీ జగదీష్ రూ. 5వేల నగదు బహుమతిని అందజేశారు. మొదటి బహుమతి సాధించి గేట్స్ కళాశాల కీర్తి ప్రతిష్టలను పెంచిన విద్యార్థులను సోమవారం కళాశాల కరస్పాండెంట్ పద్మావతమ్మ, డైరెక్టర్ శ్రీవాణి, ఎండి రఘునాథరెడ్డి అభినందించారు,



బహుమతి గెలుచుకున్న విద్యార్థులు

# కలెక్టర్ ఆఫీస్ వద్ద శానిటేషన్ కార్మికుల భారీ ధర్నా

**అనంతపురం రూరల్ (తెలుగోడు), మార్చి 30 :**
అనంతపురం ప్రభుత్వ జనరల్ హాస్పిటల్, అనుబంధ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న శానిటేషన్ కాంట్రాక్ట్ కార్మికులు, సూపర్వైజర్లు ఈరోజు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. హైకోర్టు ఆదేశాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం కార్మికులు కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ విష్ణువర్ధన్‌కి వినతి పత్రం సమర్పించారు. అయితే, సమస్యను వినాల్సిన బాధ్యత ఉన్న అధికారిగా వ్యవహరించాల్సిన జాయింట్ కలెక్టర్ వైఖరి పూర్తిగా నిర్లక్ష్యపూరితంగా, అవమానకరంగా ఉండటంపై కార్మికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.జాయింట్ కలెక్టర్ మొండి వైఖరి, ప్రజల పట్ల చూపిన నిర్లక్ష్యం, అహంకార ధోరణి ఆయన చదువు, సంస్కారం ఏ దిశలో ఉపయోగపడుతోందో స్పష్టంగా తెలియజేస్తోంది. ప్రజల సమస్యలు వినడానికి ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ వేదికను కూడా గౌరవించకపోవడం, సమాధానం ఇవ్వకుండా పోలీసుల చేత కార్మికులను బయటికి పంపించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం. ముఖ్యంగా దళిత శానిటేషన్ కార్మికుల పట్ల ప్రదర్శించిన అవమానకర వైఖరి తీవ్రంగా వ్యతిరేకంగా సిఐటియు జిల్లా కమిటీ ప్రతినిధులు అక్కడికక్కడే నిరసన వ్యక్తం చేస్తూ, అధికారుల నిర్లక్ష్య ధోరణిని తీవ్రంగా ఖండించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ కార్యక్రమం కూడా అహంకార ప్రదర్శన వేదికగా మారడం దురదృష్టకరమని పేర్కొన్నారు.

# సామూహిక గృహ ప్రవేశాలు

**యాడికి (తెలుగోడు), మార్చి 30:**
సామూహిక గృహ ప్రవేశాల కార్యక్రమంలో భాగంగా యాడికి మండల కేంద్రంలోని పిన్నేపల్లి రోడ్ లో జగనన్న కాలనీలో హౌసింగ్ లేఔట్‌లో 3 ఇళ్లు,, చందన రోడ్‌లోని జగనన్న కాలనీ హౌసింగ్ లేఔట్‌లో 1 ఇంటి గృహ ప్రవేశం నిర్వహించారు. అలాగే బేస్మెంట్, రూఫ్ లెవెల్ వరకు నిర్మించి మధ్యలో నిలిపివేసిన లబ్దిదారులకి అధికారులు అవగాహన కల్పించి త్వరితగతిన ఇళ్లు పూర్తి చేసుకోవాలన్నారు. లబ్దిదారులు ఎన్నో కలలతో ప్రభుత్వం మంజూరు చేసిన గృహాన్ని నిర్మించి, సొంత ఇంటి గృహ ప్రవేశాలని పండుగ వాతావరణంలా పిన్నేపల్లి రోడ్, చందన రోడ్ జగనన్న కాలనీ లేఔట్ లలో అధికారులు నాయకులతో కలిసి నిర్వహించారు.



జగనన్న కాలనీలలో గృహప్రవేశాల పత్రాలు అందిస్తున్న తహసీల్దార్ ప్రతాపరెడ్డి. అధికారులు. నాయకులు



జగనన్న కాలనీలలో గృహప్రవేశాల పత్రాలు అందిస్తున్న తహసీల్దార్ ప్రతాపరెడ్డి. అధికారులు. నాయకులు

ఈ కార్యక్రమం లో యాడికి మండల తహసీల్దార్ ప్రతాప్ రెడ్డి, ఎం.పి.డి.ఒ వీర్రాజు, డిప్యూటీ ఎం.పి.డి.ఒ శశికళ, హౌసింగ్ ఏ ఈ లోకేష్ కుమార్, సర్పంచ్ అనురాధ, యాడికి పంచాయతీ ఈవో అరుణ్ కుమార్, టి.డి.పి మండల కన్వీనర్ దడియాల ఆది నారాయణ యాదవ్, బిజెపి మండల కన్వీనర్ వద్ది రాజశేఖర్, జనసేన మండల కన్వీనర్ కోడి సునీల్ కుమార్, టి.డి.పి సీనియర్ నాయకులు రూపునేని రాజ శేఖర్ నాయుడు, గండికోట లక్ష్మణ్, విశ్వనాధ్, నీలకంఠ, మైనారిటీ అధ్యక్షుడు మునిమడుగు సుబహాన్. మొహమ్మద్ రఫీ. గుండా నారాయణ స్వామి, నంద్యాల రంగస్వామి, చంద్ర శేఖర్ రెడ్డి, దాసరి రామచంద్ర, రహమతుల్లా , శివశంకర్, వెలిగండ్ల ఉపేంద్ర, జనసేన ప్రధాన కార్యదర్శులు పప్పు వెంకటేష్, మధు ఆచారి, బిజెపి రమణ, మఖ్య నాయకులు, హౌసింగ్ స్టాఫ్ వర్క్ ఇన్స్పెక్టర్ మహమ్మద్ రఫి, డేటా ఎంట్రీ ఆపరేటర్ రాజేశ్వరి, ఇంజనీరింగ్ అసిస్టెంట్స్ జయలలిత, గణేష్, పాండు రంగడు, అరుణ్, హరి నారాయణ తదితరులు పాల్గొన్నారు.



యాడికిలో ఇంటి పన్ను వసూళ్లను పరిశీలిస్తున్న డిప్యూటీ ఎంపీటీవో శశికళ

# ఇంటింటికి వెళ్లి పన్నుల వసూళ్లు

### డిప్యూటీ ఎంపీటీవో శశికళ

**యాడికి (తెలుగోడు), మార్చి 30:**
యాడికి మండలంలోని 14 పంచాయితీల గ్రామ ప్రజలు ఇంటి పన్ను కుళాయి పన్నులు చెల్లించాలని డిప్యూటీ ఎంపీడీవో శశికళ తెలిపారు. సోమవారం యాడికి మేజర్ పంచాయితీలో బిల్ కలెక్టర్లు ఇంటింటికి వెళ్లి పన్నుల వసూలు తీరును డిప్యూటీ ఎంపీడీవో శశికళ ఇంటింటికి వెళ్లి పరిశీలించారు. యాడికి మేజర్ పంచాయితీ పన్ను వసూలు చాలా పెండింగ్లో ఉన్నాయని ప్రజలు పంచాయతీ బిల్ కలెక్టర్‌లు వచ్చిన సమయంలో బిల్లు చెల్లించాలని అన్నారు. కొందరు కొత్త బిల్ కలెక్టర్లు వచ్చినవారికి ప్రజలు గమనించి పంచాయతీ సిబ్బంది వచ్చిన వెంటనే ఇంటి పన్ను కోలాయ పనులు చెల్లించి గ్రామపంచాయతీకు సహకరించాలని డిప్యూటీ ఎంపీడీవో శశికళ కోరారు.



ఇంటింటికి వెళ్లి పన్నువసూళ్లను బిల్ కలెక్టర్‌తో కలిసి వసూలు చేస్తున్న డిప్యూటీ ఎంపీటీవో శశికళ

# మన ఊరు.. మన ప్రభుత్వ బడి.. మన చదువుల గుడి

### చందనలో ఉపాధ్యాయుల ప్రచారం..

**యాడికి (తెలుగోడు), మార్చి 30:**
యాడికి మండల పరిధిలోని చందన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇంచార్జ్ ప్రధాన ఉపాధ్యాయులు పవన్ కుమార్ , గణిత ఉపాధ్యాయులు మొహమ్మద్ జలీల్ బాష ఉపాధ్యాయులు బృందం, సిఆర్‌పి బాబు సోమవారం గ్రామంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు బృందం ప్రభుత్వ పాఠశాలల పనితీరు గురించి వివరించారు. మన ఊరు - మన ప్రభుత్వ బడి మన చదువుల గుడి అని, మన పిల్లలను మన పాఠశాలలో చేర్పిద్దాం నాణ్యమైన విద్య మన పిల్లలకు అందిద్దాం అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని, ప్రైవేట్ పాఠశాలలు వద్దు ప్రభుత్వ పాఠశాలలే ముద్దు అంటూ వివరించారు. విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రులు మీ పిల్లలకు మంచి విద్యను అందించే మన ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించండి, మంచి ఫలితాలను పొందండి అని అన్నారు. అలాగే పాఠశాల నిర్వహణ, అభివృద్ధిలో భాగస్వాములు కావాలని, ఊరి పిల్లలందరినీ మన ప్రభుత్వ బడిలోనే చేర్చుదాం, వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేద్దాం





చందనలో ఉపాధ్యాయుల బృందం విద్యార్థులతో మన పాఠశాల ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

అని వివరించారు. ప్రభుత్వ పాఠశాలల ప్రత్యేకతలు సుశిక్షితులైన, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయ బృందంచే నాణ్యమైన విద్యా బోధన, ఇంగ్లీష్ మీడియం బోధన తల్లికి వందనం పథకం , అర్హత ఉన్న ప్రతి పిల్లవానికి సంవత్సరానికి 15,000 రూపాయలు, సర్వేపల్లి రాధాక్రిష్ణ విద్యార్థి మిత్ర- మూడు జతల ఉచిత యూనిఫామ్, ఉచిత పాఠ్యపుస్తకాలు, బ్యాగు, బెల్టు, బూట్లు, రెండు జతల సాక్సులు, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం నాణ్యమైన రుచికరమైన మధ్యాహ్న భోజనం, వారానికి 5 కోడిగ్రుడ్లు, 3 చిక్కీలు, మూడు సార్లు రాగి మాల్ట్, ఆహ్లాదకరమైన పాఠశాల వాతావరణం ఆటపాటల ద్వారా విద్య స్మార్ట్ టీవీ ద్వారా డిజిటల్ విద్యాబోధన. విద్యార్థులందరికి ఆరోగ్య పరీక్షలు సమగ్ర ప్రగతి పత్రాల (ప్రోగ్రెస్ కార్డుల) పంపిణీ పిల్లలకు =ా మంచినీటి సౌకర్యం. మన బడి - మన భవిష్యత్తు, పాఠశాల మౌళిక సౌకర్యాల కల్పన మెగా పేరెంట్స్ మీటింగ్, విద్యార్థుల ప్రగతిపై చర్చ, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామన్నారు. 2026-2027 విద్యా సంవత్సవరానికి అడ్మిషన్లు ప్రారంభమైనాయని, మరిన్ని వివరాలకు పాఠశాల ప్రధానోపాధ్యాయులను సంప్రదించాలని ప్రచారం చేశారు.



చందన గ్రామంలో మన ఊరు మనబడి కార్యక్రమంపై ఇంటింటికి వెళ్లి ప్రచారం చేస్తున్న ప్రధానోపపాధ్యా యులు పవన్ కుమార్ జలీల్ బాషా ఉపాధ్యాయుల బృందం

# చిరుతో మరోమారు బాబి సినిమా



మన శంకర వరప్రసాద్ గారు అనే చిత్రంతో మంచి హిట్ కొట్టిన చిరంజీవి ఇప్పుడు మరో భారీ ప్రాజెక్ట్‌తో అభిమానులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ చిత్రం తన కెరీర్‌లో 158వ చిత్రంగా రూపొందుతుంది. ఈ చిత్రాన్ని గతంలో 'వాల్తేరు వీరయ్య'తో బాక్సాఫీస్ వద్ద సెన్సేషన్ సృష్టించిన దర్శకుడు కేఎస్ రవీంద్ర (బాబీ) తెరకెక్కిస్తున్నారు. ఈ హిట్ కాంబినేషన్ మళ్లీ రిపీట్ అవుతుండటంతో సినిమాపై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. 'వాల్తేరు వీరయ్య' తర్వాత బాబీ మెగాస్టార్‌ను మరింత పవర్‌ఫుల్‌గా చూపించబోతున్నారని సినీ వర్గాల్లో చర్చ నడుస్తోంది.తాజా సమాచారం ప్రకారం, ఈ క్రేజీ ప్రాజెక్ట్ రెగ్యులర్ షూటింగ్ ఏప్రిల్ 20, 2026 నుంచి ప్రారంభం కానుంది. ఇప్పటికే ప్రీ-ప్రొడక్షన్ పనులు పూర్తయ్యాయి. బెంగాల్ బ్యాక్‌డ్రాప్‌లో తండ్రీకూతుళ్ల భావోద్వేగాలతో కూడిన మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ కథను రూపొందించినట్లు సమాచారం. ఈ సినిమాను వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ అత్యంత భారీ బ్జడెట్‌తో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. టాలీవుడ్ మాత్రమే కాకుండా ఇతర ఇండస్ట్రీల నుంచి కూడా ప్రముఖ నటులను ఎంపిక చేస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి.సినిమా కాస్టింగ్ విషయంలో కూడా ఆసక్తికర విషయాలు బయటకు వస్తున్నాయి. మెగాస్టార్‌కు భార్య పాత్రలో నేషనల్ అవార్డ్ విన్నర్ ప్రియమణి నటించనున్నట్లు తెలుస్తోంది. కూతురు పాత్రలో 'కన్నప్ప' ఫేమ్ ప్రీతి ముకుందన్ ఎంపికైనట్లు సమాచారం.

# ప్రకాశ్‌రాజ్‌కు మాతృవియోగం



విలక్షణ నటుడు ప్రకాశ్ రాజ్ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. ఆయన మాతృమూర్తి సువర్ణలత (86) సోమవారం ఉదయం బెంగళూరులోని స్వగృహంలో కన్నుమూశారు. అనారోగ్య సమస్యలతో గత కొంతకాలంగా బాధపడుతున్న ఆమె ఆరోగ్యం విషమించడంతో తుది శ్వాస విడిచారు. తల్లితో ఎంతో ఆత్మీయ అనుబంధం కలిగిన ప్రకాశ్ రాజ్, షూటింగ్‌లతో బిజీగా ఉన్నప్పటికీ తరచూ ఆమెను పరామర్శించేవారు. మరణవార్త తెలియగానే వెంటనే బెంగళూరుకు చేరుకున్న ఆయన, కుటుంబ సభ్యులతో కలిసి అంత్యక్రియల ఏర్పాట్లలో పాల్గొన్నారు. ఈ విషాద ఘటనపై పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సోషల్ మీడియా ద్వారా స్పందిస్తూ, 'ప్రకాశ్ రాజ్ గారి మాతృమూర్తి సువర్ణలత గారి మరణ వార్త తెలిసి తీవ్రంగా విచారించాను. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నాను. ఈ దుఃఖ సమయంలో ప్రకాశ్ రాజ్ గారికి, వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను' అని పేర్కొన్నారు. ప్రకాశ్ రాజ్ కుటుంబం ఈ విషాదాన్ని ధైర్యంగా ఎదుర్కొనాలని సినీ వర్గాలు, అభిమానులు కోరుకుంటున్నారు.

# సల్మాన్ ఖాన్‌తో వంశీ పైడిపల్లి మూవీ



బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్‌తోవంశీ పైడిపల్లి సినిమా చేయనున్నట్లు ఎప్పటినుంచో వార్తలు వస్తోన్న
విషయం తెలిసిందే. ఈ ప్రాజెక్ట్‌పై అధికారిక ప్రకటన వెలువడింది. శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై ఇది రానున్నట్లు తెలుపుతూ ఓ ఫొటో షేర్ చేసింది. ఏప్రిల్ నుంచి దీని షూటింగ్ ప్రారంభం కానున్నట్లు వెల్లడించింది. ఇందులో హీరోయిన్‌గా నయనతారను ఎంపిక చేసినట్లు కూడా ఇటీవల వార్తలు వచ్చాయి. బాలీవుడ్ సీనియర్ నటుడు అనిల్‌కపూర్ ఓ కీలక పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. త్వరలోనే నటీనటుల వివరాలు పంచుకోనున్నారు. 2027లో దీన్ని విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం సల్మాన్ ఖాన్ 'మాతృభూమి'లో నటిస్తున్నారు. దీనితోపాటే వంశీ సినిమాను కూడా మొదలు పెట్టనున్నట్లు తెలుస్తోంది. భారీస్థాయిలో దీన్ని తెరకెక్కించనున్నారు. నిజానికి సల్మాన్‌కు మంచి హిట్ పడి చాలాకాలం అయింది. మరోవైపు వంశీ కూడా చివరిగా విజయ్ హీరోగా 'వారసుడు' రూపొందించారు. అది అనుకున్న స్థాయిలో అంచనాలను అందుకోలేకపోయింది. అప్పటినుంచి సల్మాన్ ప్రాజెక్ట్ పైనే వర్క్ చేశారు. దీంతో ఈ ప్రాజెక్ట్ ఇద్దరికీ కీలకంగా మారింది.



# ఓటిటీలోకి సాంప్రదాయనీ సుద్దపూసిని

శివాజీ, లయ, రోహన్ నటించిన తాజా చిత్రం సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని. మార్చిలో థియేటర్‌లో విడుదలై నవ్వులు పంచిన ఈ సినిమా ఇప్పుడు ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. ఏప్రిల్ 3 నుంచి నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమింగ్ కానుంది. సుధీర్ శ్రీరామ్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో అలీ, ధనరాజ్, ఇమ్మాన్యుయేల్ నవ్వులు పూయించారు. శ్రీరామ్ (శివాజీ) నిజాయతీపరుడైన పంచాయతీ కార్యదర్శి. కొత్తకోట సమీపంలోని హార్స్‌లీహిల్స్‌లో భార్య ఉత్తర (లయ), కొడుకు బిట్టు అలియాస్ నితిన్ (రోహన్)తో కలిసి జీవిస్తుంటాడు. ఓ దీపావళి రోజున వాళ్ల ఇంటికి ఆ ఊరి ఎస్సై విక్రమ్ వాసుదేవ్ (ప్రిన్స్) వస్తాడు. అతనికి ఆడవాళ్ల పిచ్చి. అప్పటికే శ్రీరామ్‌తో ఓసారి గొడవ జరుగుతుంది. దీంతో అతనిపై పగ పెంచుకున్న విక్రమ్.. ఇంట్లో తను లేడని తెలిసి ఉత్తరపై అఘాయిత్యానికి ప్రయత్నిసాడు. కట్ చేస్తే.. అనూహ్యంగా శ్రీరామ్ కొడుకు చేతిలో ఆ ఎస్సై హత్యకు గురవుతాడు. మరి ఆ తర్వాత ఏమైంది? ఆ హత్య కేసు నుంచి తన కుటుంబాన్ని కాపాడుకునేందుకు శ్రీరామ్ ఏం చేశాడు? రూ.కోటి డబ్బుతో ఉన్న తన గిఫ్ట్ బ్యాగ్ ఎత్తుకెళ్లారంటూ స్థానిక ఎమ్మెల్యే తిమ్మప్ప (శరత్ లోహితాశ్వ) గ్యాంగ్ శ్రీరామ్ వెంట పడటానికి కారణమేంటి? ఈ మొత్తం కథకు కానిస్టేబుల్ సుధీర్ (ధనరాజ్)కు ఉన్న సంబంధం ఏంటి? అన్నది చిత్ర కథ.

# దురంధర్ చూసి పాఠాలు నేర్చుకోవాలి..ఆర్‌జీవి

రణ్‌వీర్ సింగ్ హీరోగా తెరకెక్కిన దురంధర-2 చిత్రం తొలిరోజు నుంచే వసూళ్ల సునామీ సృష్టిస్తోంది. ఇప్పటివరకూ ప్రపంచవ్యాప్తంగా రూ.1,365 కోట్లు తన ఖాతాలో వేసుకుంది. దీంతో మొదటిభాగం ఆల్‌టైమ్ కలెక్షన్ల రూ.1,307 కోట్లును ఈ సీక్వెల్ కేవలం 11 రోజుల్లోనే దాటేసింది. ఇకపోతే ఉలవురు ప్రముఖులు ఈ చిత్రాన్ని ప్రశంసిస్తూనే ఉన్నారు. తాజాగా దర్శకుడు రామ్ గోపాల్ వర్మ మరోసారి సోషల్ మీడియా వేదికగా సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆదిత్య ధర్ తెరకెక్కించిన తాజా చిత్రం 'ధురంధర్ 2' బాక్సాఫీస్ వద్ద సృష్టిస్తోన్న ప్రభంజనంపై స్పందిస్తూ.. చిత్ర పరిశ్రమలోని ప్రముఖుల మౌనాన్ని ఆయన ప్రస్తావించారు. ఈ సినిమా సాధించిన విజయం ఒక 'అణుబాంబు' లాంటిదని ఆయన అన్నారు. ఆదిత్య ధర్ చిత్ర పరిశ్రమ కింద ఒక అణుబాంబును పేల్చారు. కానీ ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. మిగిలిన చిత్ర పరిశ్రమ అంతా మౌనం పాటిస్తోంది. 'ధురంధర్ 2' పేలుడు ధాటికి అందరూ అంతరిక్షంలోకి వెళ్లారేమో.. అందుకే వారి చప్పట్లు ఇక్కడికి వినిపించడం లేదు. బహుశా వారంతా ఇది కేవలం ప్రచారమే అని, త్వరలోనే తగ్గిపోతుందని తమలో తాము గుసగుసలాడుకుంటున్నారేమో. అలా అనుకుంటూ మళ్లీ పాత కాలపు మూస సినిమాలను తీయాలని చూస్తున్నారు. లేదా ఈ సినిమా అద్భుతమైన విజయాన్ని చూసి, తాము తీస్తున్న సినిమాలు దీని ముందు నిలవలేవని అనుకొని మౌనంగా ఉంటున్నారేమో అంటూ వ్యాఖ్యానించారు.
కళ్ళెదుట డైనోసార్ లాంటి సినిమా నిలబడి నిప్పులు కురిపిస్తుంటే, దాని బాక్సాఫీస్ గర్జనతో భూమి కంపిస్తుంటే.. కళ్లు మూసుకోవడం సరైన పద్ధతి కాదు. నా సహచరులందరికీ నేను ఇచ్చే సలహా ఒక్కటే.. 'ధురంధర్ 2' సినిమాను ఒక పాఠంలా చదవండి. దీన్ని చూసి మీ చిత్రాల్లో మార్పులు చేసుకోండి' అని ఆర్జీవీ సలహా ఇచ్చారు. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.



Publisher and Owned by S.BABAJAN, Main Road, Nallamada, ANANTHAPUR, Andhrapradesh-515501. Printed At SUNDAY PRINTING PRESS, SVN Coliny, Gunturu... EDITOR- B.SHANKAR PRASAAD .. PRGI No- APTEL/25/A2739, Cell- 9963496956, 7382712780.